
# యువశక్తికి నైపుణ్య యుక్తి

## వరంలా పీఎం ఇంటర్న్‌షిప్ పథకం




**ఈనాడు డిజిటల్, తిరుపతి:** యువ దేశం మనది.. జనాభాపరంగా ప్రపంచంలోనే అధిక సంఖ్యలో యువత ఉన్నా నైపుణ్యం విషయంలో మాత్రం వెనుకబడే ఉన్నాం. కొలువుకు తగిన నైపుణ్యం లేకపోవడంతో ఉద్యోగాలు సాధించలేక కోట్లమంది యువత నిరాశకు గురవుతున్నారు. అందుకే కేంద్ర ప్రభుత్వం యువతపై దృష్టిసారించింది. ఏడాదిపాటు నైపుణ్యాభివృద్ధి శిక్షణను ఉద్దేశించింది. ఈనెల 12న మొదలైన ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ 25వ తేదీ వరకు కొనసాగనుంది.

### లక్ష మందితో పైలెట్ ప్రాజెక్టుగా..

ఈ ఏడాది డిసెంబర్ 2 నుంచి ప్రారంభమయ్యే శిక్షణ ఏడాదిపాటు కొనసాగనుంది. వచ్చే ఐదేళ్లలోపు దేశ వ్యాప్తంగా కోటిమందికి ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్న కేంద్ర ప్రభుత్వం 2024-25 ఏడాదికిగాను లక్షమందితో మొదలుపెట్టనుంది. ఆన్‌లైన్ దరఖాస్తులను పరిశీలించి పారదర్శకంగా అడుగులు వేయనుంది. ఏడాది శిక్షణ కాలంలో ప్రతినెలా రూ.5000 స్టైఫండ్ అందించనుంది. అందులో ప్రభుత్వం రూ.4,500, సంబంధిత పరిశ్రమ

**21-24 ఏళ్ల యువత** (సుమారుగా)

**చదువు మొత్తం**

డిగ్రీ: 25,000

డిప్లొమా: 6,600

ఐటీఐ : 5,000

### 500 పైగా పరిశ్రమల్లో..

ఐటీసీ, రిలయన్స్, టాటా గ్రూప్, ఇన్ఫోసిస్, విప్రో, మహింద్రా, మారుతి సుజుకి, హెచ్‌యూఎల్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వంటి 500పైగా సంస్థలు, పరిశ్రమల్లో నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నారు.

### వీటిల్లో శిక్షణిస్తారు

బ్యాంకింగ్, ఆయిల్, గ్యాస్ అండ్ ఎనర్జీ, మైనింగ్, టెలికాం, రిటైల్, సిమెంట్, బిల్డింగ్ మెటీరియల్స్, ఫార్మా, ఏవియేషన్, మానుఫ్యాక్చరింగ్, అగ్రికల్చర్, జెమ్స్ జ్యువెలరీ, ట్రావెల్ హాస్పిటాలిటీ, సాఫ్ట్‌వేర్ తదితర రంగాలు.

### వీళ్లకు అవకాశం లేదు...

ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఎం, ఎంబీఏ, సీఎస్, సీఏ, ఎంబీబీఎస్ చదివిన వాళ్లంతా పీఎం ఇంటర్న్‌షిప్‌కు దరఖాస్తు చేసుకునేందుకు అనర్హులు.

## 25వ తేదీ వరకు దరఖాస్తు ప్రక్రియ

సీఎస్ఆర్ నిధి నుంచి రూ.500 చెల్లిస్తారు. అదనంగా ఏకకాల గ్రాంట్ కింద రూ.6,000 చెల్లిస్తారు. పీఎం జీవన్‌జ్యోతి బీమాయోజన, పీఎం సుకన్య బీమా యోజన వర్తించేలా ప్రభుత్వం కృషి చేయనుంది.

### అర్హులు వీరే..

పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీ చేసిన 21-24 ఏళ్ల యువత మాత్రమే ఈ శిక్షణకు అర్హులు.

### దరఖాస్తు చేసుకోండిలా..

శిక్షణకు www.pminternship.mca.gov.in అధికారిక వెబ్‌సైట్ ఓపెన్ చేయాలి. అందులోని 'రిజిస్టర్' బటన్ నొక్కి ఫోన్ నంబర్ లేదా ఈమెయిల్ ఐడీతో కొత్తగా ఖాతా ప్రారంభించాలి. వ్యక్తిగత వివరాలు, విద్యార్హతకు సంబంధించిన ధ్రువపత్రాలు, పాస్‌ఫొటో అప్‌లోడ్ చేసి సబ్‌మిట్ చేయాలి.

## సర్వదర్శనానికి 12 గంటలు

**తిరుమల:** ఎస్ఎస్‌డీ టోకెన్లు లేకుండా శుక్రవారం సాయంత్రానికి క్యూలైన్లలో వచ్చిన భక్తులకు దాదాపు 12 గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుందని తితిదే తెలిపింది. రూ.300 టికెట్లు కలిగిన వారికి మూడు గంటల సమయం పడుతోంది. గురువారం శ్రీవారిని 58,637 మంది దర్శించుకున్నారు. రూ.3.69 కోట్ల హుండీ కానుకలు లభించాయి. గదుల కోసం రద్దీ కొనసాగుతోంది.

# 500 హెక్టార్లలో వరికి నష్టం



వాకాడు మండలంలోని దుగ్గరాజపట్నం వద్ద నీట మునిగిన వరి పంటలు

**ఈనాడు డిజిటల్, తిరుపతి:** గత నాలుగు రోజులుగా జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు 500 హెక్టార్లలో వరి పంటకు నష్టం వాటిల్లినట్టు జిల్లా వ్యవసాయాధికారులు ప్రాథమిక అంచనా వేశారు. సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం, పిచ్చాటూరు, నాగలాపురం, సత్యవేడు, వాకాడు మండలాల్లోని 40 గ్రామాల్లో 737 మంది రైతులు పంట నష్టపోయారు. 25 హెక్టార్లలో నారుమళ్లు, 30 రోజుల క్రితం 471 హెక్టార్లలో వేసిన నాట్లు నీళ్లలో మునిగాయి. నాలుగు హెక్టార్లలో కోతకొచ్చిన వరి చేజారిపోయింది. కోతకొచ్చిన పంటకు నష్టపరిహారం అందించి, మిగతా విభాగాల్లో నష్టపోయిన పంటకు బదులు ఉచితంగా విత్తనాలు అందించేందుకు జిల్లా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

# నియోజకవర్గాల్లో సమస్యలు పరిష్కరిస్తాం

### ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి చంద్రబాబు




సమావేశంలో ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు

**ఈనాడు-తిరుపతి:** రాష్ట్ర వ్యాప్తంగా నియోజకవర్గానికి ఒక పారిశ్రామికవాడ ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్ణయించారు. వీటికి స్థానిక ఎమ్మెల్యేలను ఛైర్మన్‌గా నియమిస్తామన్నారు. శుక్రవారం తెదేపా ఎమ్మెల్యేలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గాల అభివృద్ధితోపాటు పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా తెదేపా హయాంలో నిర్మించిన ఇళ్లకు, నీరు-చెట్టు పథకం కింద చేసిన పనులకు బిల్లులు చెల్లించని విషయాన్ని ఎమ్మెల్యేలు ప్రస్తావించగా సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల పరిధిలో పలు పనులు పూర్తి చేసే విషయాన్ని ప్రస్తావించారు.

◆ చంద్రగిరి నియోజకవర్గంలో పారిశ్రామికవాడ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే పులివర్తి నాని కోరగా, తప్పనిసరిగా చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. శ్రీకాళహస్తిలో పలు పరిశ్రమలకు వైకాపా ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇవ్వలేదని, విడుదల చేయాలని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కోరారు. ల్యాంకో ఎలక్ట్రో స్టీల్స్ పరిశ్రమకు సిలికా సరఫరా నిలిపివేత విషయాన్ని ప్రస్తావించగా.. తగిన చర్యలు తీసుకుంటామని సీఎం స్పష్టం చేశారు. తిరుపతి, శ్రీకాళహస్తి, వెంకటగిరి నియోజకవర్గ ప్రజలకు అవసరమైన ఆల్తూరుపాడు జలాశయ పనులను పూర్తి చేయాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కోరారు. సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. గూడూరులోని ఫ్లైఓవర్ పూర్తి చేయాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ కోరారు. సిలికా తవ్వకాల కోసం మైనింగ్ డీలర్స్ లైసెన్సులు ఇవ్వాలని అడిగారు. వీటిని పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు.

# విద్యాంజలి పేరిట వల!

- ❖ డీఈవో ఆదేశాలు లేకుండానే పాఠశాలల్లో విధులు?
- ❖ విశాఖపట్నానికి చెందిన ఓ బ్యాంకు చెక్కులతో కుచ్చుటోపీ
- ❖ కేంద్ర పథకాన్ని చూపి ఘరానా మోసం



నియామక పత్రం

**కుప్పం గ్రామీణ, చిత్తూరు విద్య, న్యూస్‌టుడే:** వాలంటీర్లు స్వచ్ఛందంగా ముందుకొచ్చి తమ పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొని ఆయా పాఠశాలలకు అవసరమైన వసతులు, సేవలు ఉచితంగా అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం విద్యాంజలి 2.0 పథకాన్ని ప్రవేశపెట్టింది. దీన్ని కొందరు అక్రమార్కులు తమకు అనుకూలంగా చేసుకుని ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులకు కుచ్చుటోపీ పెట్టారు. డీఈవో కార్యాలయం నుంచి పాఠశాలలకు ఎలాంటి ఉత్తర్వులు రాకపోయినా ఓ క్లర్క్ పేరుతో హెచ్ఎంలకు నేరుగా ఫోన్ చేసి మాట్లాడి నకిలీ ఉద్యోగ నియామకపత్రాలతో విధుల్లోకి చేర్చారు. నెలలు తరబడి పనిచేసినా జీతాలు అందకపోవడంతో అవి నకిలీ ఉద్యోగాలని తేలడంతో ఎట్టకేలకు విద్యాశాఖ అధికారులు వారిని విధుల నుంచి తప్పించారు. ఈ మోసం రాష్ట్రంలోని అన్ని జిల్లాలో జరిగినట్లు ఆరోపణలున్నాయి. విద్యాంజలి పథకాన్ని వినియోగించుకుని కొన్ని ప్రముఖ సంస్థల పేర్లతో నియమాకాలు జరిగినట్లు సమాచారం. జిల్లాలో గుజరాత్ వ్యాపారి పేరుతో స్థాపించిన ఓ సంస్థ, ఓ హెల్త్ కేర్ సంస్థ పేరిట ఉత్తర్వులు ఇచ్చారు. అందులో నెల జీతంతో పాటు సంవత్సరాదాయం సైతం తెలిపారు.

### ఉద్యోగానికి రూ.3 లక్షల వరకు వసూలు

ఒక్కో ఉద్యోగానికి రూ.2.50 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు దళారులు వసూలు చేశారు. నెలలు తరబడి పనిచేసినా వారికి జీతాలు అందలేదని, వేతనం లేదా ఇచ్చిన నగదు తిరిగివ్వాలని కుప్పం, చిత్తూరుకు చెందిన దళారులపై బాధితులు ఒత్తిడి చేశారు. కొందరికి విశాఖపట్నానికి చెందిన ఓ బ్యాంకు ఖాతాకు చెందిన చెక్కులిచ్చారు. అందులో నగదు లేకపోవడంతో వారు వెనుదిరిగారు. గత ప్రభుత్వంలో ఓ మంత్రి వద్ద పనిచేసిన ఉద్యోగి ఈ అక్రమంలో కీలకంగా ఉన్నట్లు బాధితులు ఆరోపిస్తున్నారు.

### ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేక..

2022 నుంచి రెండేళ్ల పాటు జరిగిన ఈ వ్యవహారంపై వైకాపా హయాంలో అప్పటి చిత్తూరు డీఈఓతోపాటు అప్పటి కలెక్టర్, ఎస్పీలకు సైతం బాధితులు ఫిర్యాదు చేశారు. వైకాపా ప్రభుత్వంలో కీలక వ్యక్తి హస్తం ఉండటంతో ఈ వ్యవహారంపై విచారణ చేపట్టడానికి ఎవరూ సాహసించలేదని బాధితులు ఆరోపిస్తున్నారు. కనీసం ఫిర్యాదు తీసుకోలేదని వాపోతున్నారు. దీన్నిబట్టి ఈ కుంభకోణం ఏ స్థాయిలో జరిగిందో ఇట్టే అర్థమవుతోందని పెదవి విరుస్తున్నారు. తెదేపా అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా బాధితులు రెండుదఫాలు చిత్తూరు కలెక్టర్‌కు అర్జీలు ఇచ్చారు. అవి పోలీసు శాఖకు వెళ్లినా. . బాధితులకు న్యాయం జరగలేదు. అన్ని జిల్లాల్లో బాధితులు ఉన్నారని, ప్రభుత్వం సీఐడీ వంటి సంస్థలతో విచారణ చేయిస్తే ఫలితం ఉంటుందని పేరు వెల్లడించడానికి ఇష్టపడని ఓ పోలీసు అధికారి అభిప్రాయపడ్డారు.

### డీఈవో కార్యాలయంలో ఎవరా క్లర్కు..?

స్వచ్ఛంద సంస్థల నియామకపత్రాలతో నిరుద్యోగులు జడ్పీ ఉన్నత పాఠశాలలకు వెళ్లడంతో ప్రధానోపాధ్యాయులు అవాక్కయ్యారు. ప్రభుత్వం పాఠశాలలకు సంబంధించి ఎలాంటి పోస్టులను భర్తీచేయకపోయినా.. రికార్డు అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్ ఉద్యోగాలు ఎక్కడివని వారి వెనక్కు పంపే ప్రయత్నం చేయగా... డీఈఓ కార్యాలయం నుంచి క్లర్కు మాట్లాడుతున్నానని.. విధుల్లో వారిని చేర్చుకోవాలని మౌఖిక ఆదేశాలు అందాయి. విధిలేక వారిని చేర్చుకోని సర్వీసు, హాజరు పట్టికలను సైతం వారు అందించారు. అయితే ప్రస్తుతం ఆ ఉద్యోగాలు నకిలీవని తేలడంతో హెచ్ఎంలు తలలు పట్టుకుంటున్నారు. వారిని విచారిస్తే మోసంలో విద్యాశాఖలో కీలకంగా వ్యవహరించిన క్లర్క్ వివరాలు వెలుగులోకి వస్తాయి.

# గ్రామీణ దారులకు మోక్షం

### 154 కి.మీ. రహదారుల బాగు



సూళ్లూరుపేట-శ్రీకాళహస్తి రోడ్డులో చేస్తున్న పనులు

**సూళ్లూరుపేట, న్యూస్‌టుడే:** వైకాపా ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన గ్రామీణ రోడ్లను బాగు చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆ మేరకు పనుల్లో కదలిక మొదలైంది. తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో మూడేళ్ల కిందట నిలిచిన న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు (ఎన్‌డీబీ) రోడ్లను బాగు చేసేందుకు శ్రీకారం చుట్టింది.

జిల్లాల్లో బాగా రద్దీగా ఉన్న ఏక వరుస రహదారులను రెండు వరుసలుగా విస్తరించేందుకు 2019లో ఎన్‌డీబీ ముందుకొచ్చింది. ఈ పనులకు ఎన్‌డీబీ 70 శాతం నిధులు రుణంగా ఇస్తుంది. మిగిలిన 30 శాతం రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చాలి. గత ప్రభుత్వం నిధులను మంజూరు చేయకపోవడంతో పలుచోట్ల ప్రారంభానికి నోచుకోలేదు. మరికొన్ని చోట్ల చేపట్టిన పనులు పూర్తి చేయకుండానే గుత్తేదారులు వదిలేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్రం వాటా ఇచ్చేందుకు సుముఖత తెలపడంతో ఎన్‌డీబీ సానుకూలంగా స్పందించింది.

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో రోజుకు రెండు వేలకు పైగా వాహనాలు రాకపోకలు సాగించే (పీసీయూ) రహదారులను గుర్తించి, వాటిని రెండు వరుసలుగా విస్తరించేలా గత తెదేపా హయాంలో నిర్ణయించారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో రెండు వేల పీసీయూ పైగా ఉండే 200 కి.మీ. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 92.97 కి.మీ. రహదారులను గుర్తించారు. వీటి విస్తరణకు ఎన్‌డీబీ రూ.435.82 కోట్లు నిధులు మంజూరు చేసింది. అంతలోనే వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రాగా.. రోడ్ల బాగుకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన 30 శాతం వాటా చెల్లించకపోవడంతో పనులు పడకేశాయి.

### ఇవీ రోడ్లు

- సూళ్లూరుపేట-శ్రీకాళహస్తి రహదారి 6.4కి.మీ.(పెరిమిటిపాడు వరకు)
- సూళ్లూరుపేట-మీట్ ఎన్డీ రోడ్డు 30.2కి.మీ(సూళ్లూరుపేట-కోట-కొత్తగుంట)
- ఎంసీ రోడ్డు-బంగాళాఖాతం రహదారి 8.4కి.మీ.(అన్నమేడు, గూడలి)
- ఏర్పేడు-చెన్నూరు రోడ్డు నుంచి బాలాయపల్లి, జయంపు మీదుగా నాయుడుపేట-రాపూరు రోడ్డు 8.4 కి.మీ.
- గూడూరు-జయంపు రోడ్డు 8.3 కి.మీ.
- సూళ్లూరుపేట-సంతవేలూరు రోడ్డు 12.01కి.మీ.(బీఎన్‌కండ్రిగ-పెరిమిటిపాడు)
- శ్రీకాళహస్తి-ముసలిపేడు రోడ్డు 5.90 కి.మీ.
- దేవదొడ్డి-లక్కన్నపల్లి రోడ్డు వయా తీర్థం 9.05 కి.మీ.
- సీఏ రోడ్డు-పూతలపట్టు-రామాపురం వయా కొండేపల్లి 5.92కి.మీ.
- పూతలపట్టు-ఐరాల వయా కొండేపల్లి 3.42 కి.మీ.

# ఏకోపాధ్యాయులకు విముక్తి

వచ్చే ఏడాది జీవో 117 రద్దు ◆ వైకాపా నిర్ణయంతో సర్కారు బడులు కళావిహీనం

◆ పేదలకు విద్యనందించే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు



రామచంద్రాపురం మండలం పెద్దినాయుడుకండ్రిగ ఏకోపాధ్యాయ పాఠశాలలో ఒకే విద్యార్థి (పాత చిత్రం)

❖ బుచ్చినాయుడుకండ్రిగ మండలంలో ఉన్న ఓ ఏకోపాధ్యాయ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు అత్యవసరంగా సెలవు పెట్టాల్సి వచ్చింది. పక్కనున్న పాఠశాలలోని మరో ఉపాధ్యాయుడి అనుమతి తీసుకుని మరీ సెలవు పెట్టాడు.

❖ తొట్టంబేడు మండలంలోని ఓ పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. విద్యార్థుల సంఖ్య తక్కువుందనే కారణంతో వాళ్లలో ఒకరిని వేరేచోటకు బదిలీ చేశారు. మిగిలిన ఆ ఒక్కడే అత్యవసర పరిస్థితుల్లో సెలవు పెట్టకుండా విద్యార్థులకు పాఠాలు చెబుతున్నారు.

**ఈనాడు డిజిటల్ తిరుపతి, న్యూస్‌టుడే, చిత్తూరు విద్య**

1, 2, 4, 7, 10.. ఇవన్నీ క్రికెటర్ల స్కోరు అనుకునేరు.. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య.. కొన్నిచోట్ల పిల్లలు లేక అక్కడి ఉపాధ్యాయులను అదే మండలంలో మరో పాఠశాలకు డిప్యూటేషన్‌పై పంపారు.. మనబడి నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని గత ప్రభుత్వ పాలకులు చెప్పిన కాకి లెక్కలకు ప్రస్తుత పరిస్థితి ఇదీ.. వైకాపా పాలనలో తెచ్చిన జీవో 117 అమలు చేసి 3, 4, 5 తరగతుల విలీనంతో ఆ ప్రభావం ప్రాథమిక పాఠశాలలపై పడింది.. దీంతో ఆ ప్రాంతాల్లోని తల్లిదండ్రులు తమ పిల్లలను వేరేచోట లేక ప్రైవేటు పాఠశాలలకు పంపడంపై అక్కడి ఉపాధ్యాయులు అవగాహన కల్పించినా వారు వినలేదు.. నాటి ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పడిపోయింది.

### ఉమ్మడి జిల్లాలో..

- ◆ ప్రాథమిక పాఠశాలలు: 3,676
- ◆ విద్యార్థులు: 1,02,556
- ◆ ఏకోపాధ్యాయ పాఠశాలలు: 1,946
- ◆ విద్యార్థులు: 28,012
- ◆ పదిమందిలోపు విద్యార్థులున్న పాఠశాలలు: 356 (చిత్తూరు జిల్లా), 292 (తిరుపతి జిల్లా)

### అడ్డగోలుగా తగ్గుదల..

వైకాపా హయాంలో తెచ్చిన జీవో 117 అమలుతో పేద విద్యార్థులు చదువుకు దూర మయ్యారు. జాతీయ నూతన విద్యావిధానం-2020 పేరుతో 117 జీవో అమలు చేసి 98 మంది కంటే విద్యార్థులు తక్కువ ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను, కిలోమీటరు దూరంలో ఉన్న హైస్కూళ్లలో విలీనం చేశారు. మరోపక్క హేతుబద్ధీకరణ పేరుతో ఉపాధ్యాయులను బదిలీ చేశారు. ఉమ్మడి జిల్లాలోని 1,946 ఏకోపాధ్యాయ పాఠశాలల్లో, కేవలం ఒక్క ఉపాధ్యాయుడే 1-5 తరగతుల్లో అన్ని పాఠ్యాంశాలు బోధిస్తున్నారు. కూటమి ప్రభుత్వం రాగానే విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారించింది. వచ్చే విద్యాసంవత్సరం నుంచే జీవో 117 రద్దుకు చర్యలు తీసుకోనుంది.

### మంత్రి లోకేశ్ హామీతో పూర్వ వైభవం!

పూతలపట్టు మండలం ఆకణాంబట్టు జడ్పీ ఉన్నత పాఠశాలను ఇటీవల విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆపై ఉపాధ్యాయ సంఘాల నాయకులతో మంత్రి ఇటీవల చర్చించగా.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడానికి జీవో 117అని తేలింది. దీన్ని రద్దు చేస్తే గత వైభవం వస్తుందని అందరూ మంత్రి దృష్టికి తీసుకురావడంతో వచ్చే విద్యా సంవత్సరం నుంచి దీన్ని తప్పక రద్దు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.



సమావేశంలో సమీక్షిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, కమిషనర్

# ఏసీలు బాగు చేయకుంటే ఉద్యోగాలు పోతాయ్

### రుయా హెచ్‌డీఎస్ సమావేశంలో కలెక్టర్ హెచ్చరిక

**తిరుపతి (వైద్యవిభాగం), న్యూస్‌టుడే:** 'రుయా ఆపరేషన్ థియేటర్లలో ఏసీ మిషన్లు పనిచేయక ఇన్‌ఫెక్షన్‌కు గురవుతున్న విషయాన్ని గతంలో మీ దృష్టికి తెచ్చా. నెలలు గడిచినా సక్రమంగా స్పందించకపోవడంతో పేద రోగులకు అన్యాయం జరుగుతోంది. ఆ పని కూడా చేయకపోతే మీరెందుకు? ఈ నెలాఖరులోగా బాగు చేయకుంటే ఏఈ, రుయా ఎలక్ట్రికల్ సిబ్బంది ఉద్యోగాలు పోతాయి'అని కలెక్టర్ వెంకటేశ్వర్ ఏపీఎంఎస్ఐడీసీ ఎలక్ట్రికల్ ఇంజినీర్లను హెచ్చరించారు. రుయా హాస్పిటల్ అభివృద్ధి కమిటీ (హెచ్‌డీఎస్) సమావేశం ఎస్వీ వైద్య కళాశాలలో శుక్రవారం నిర్వహించారు. ఛైర్మన్ హోదాలో కలెక్టర్, కో ఛైర్మన్ హోదాలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, నగరపాలక కమిషనర్ మౌర్య సమావేశంలో పాల్గొన్నారు. గత సమావేశాల్లోని తీర్మానాలను సమీక్షించారు. వైద్య విభాగాధిపతులు, ఏజెన్సీల ప్రతినిధులతో చర్చించారు. రుయా సూపరింటెండెంట్ రవిప్రభు అజెండా వివరించారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. నాణ్యమైన వైద్యం.. సౌకర్యాల కల్పనకు అన్ని విధాలుగా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. హెచ్‌డీఎస్ సభ్యుడు బండ్ల లక్ష్మీపతి, ప్రిన్సిపల్ చంద్రశేఖరన్, డీఎంహెచ్‌వో శ్రీహరి, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ శివరామిరెడ్డి, డీసీహెచ్ఎస్ ఆనందమూర్తి తదితరులు పాల్గొన్నారు.


### టెట్‌కు 1,808 మంది హాజరు

**తిరుపతి(బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే:** జిల్లా వ్యాప్తంగా శుక్రవారం 4 కేంద్రాల్లో జరిగిన టెట్‌కు 1,808 మంది హాజరయ్యారు. ఉదయం 816 మందికి గాను 681 మంది, మధ్యాహ్నం 1,384 మందికి గాను 1,127 మంది పరీక్ష రాశారు.

# పర్యాటక భవనం పూర్తయ్యేదెన్నడో?

◆ వైకాపా హయాంలో పట్టించుకోని వైనం

◆ కూటమి ప్రభుత్వం దృష్టిసారించాలని కోరుతున్న ప్రజలు



అసంపూర్తిగా పర్యాటక భవనం

**ఈనాడు-తిరుపతి:**

పర్యాటక రంగానికి అనేక అవకాశాలు ఉన్న జిల్లాలోనే ఆ శాఖకు ప్రత్యేక భవనం లేకుండా పోయింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని అలిపిరి ప్రాంతంలో నాడు తెదేపా ప్రభుత్వం పనులు చేపట్టింది. అయితే వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క పనీ చేయలేదు. దీంతో ఐదేళ్లుగా నిర్మాణ పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం పర్యాటక రంగంపై ప్రత్యేక దృష్టిసారించింది. ఈ నేపథ్యంలో దీన్ని అందుబాటులోకి తీసుకువస్తే యాత్రికులకు పర్యాటక ప్రదేశాలపై పూర్తి సమాచారం తెలుసుకునేందుకు అవకాశం ఉంటుంది. రుయా ఆసుపత్రి ఎదురుగా ఎకరా స్థలంలో పర్యాటక భవనాన్ని రూ.17 కోట్లతో 2013లో పనులు ప్రారంభించారు. ఇది పూర్తయితే మొత్తం 103 గదులు, అత్యాధునిక సమావేశ మందిరం, పర్యాటకశాఖ డివిజనల్ కార్యాలయం, కేంద్రీయ విచారణ కార్యాలయం అందుబాటులోకి వస్తుంది. 2014లో చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత పనులు వేగవంతంగా నడిచాయి. 2019లో నాడు తెదేపా అధికారంలో ఉన్నంత వరకు రూ.11 కోట్లు ఖర్చు చేశారు. వైకాపా హయాంలో కనీసం పట్టించుకోలేదు. తాజాగా కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టిసారించింది. ఇప్పటికే మిగిలిన పనులకు అధికారులు టెండర్లు పిలిచారు. ఇక్కడే ఓ సమస్య ఏర్పడింది. పలు అంశాలకు సంబంధించి కార్పొరేషన్ అధికారుల నుంచి అనుమతులు రావాల్సి ఉందని పేర్కొంటున్నారు. ఒక్కసారి అనుమతులు వస్తే పనులు పూర్తి చేస్తామని స్పష్టం చేస్తున్నారు. దీనిపై జకలెక్టర్ ప్రత్యేక దృష్టిసారించి పర్యాటక, కార్పొరేషన్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తే భవన నిర్మాణం పూర్తయి ప్రజలకు అందుబాటులోకి వస్తుంది.

### ఇవీ ప్రయోజనాలు..

తిరుమల భక్తులకు జిల్లాలోని పర్యాటక ప్రాంతాలపై సరైన సమాచారం ఉండట్లేదు. ఇది అందుబాటులోకి వస్తే సులువుగా తెలుసుకోవచ్చు. దీనివల్ల ప్రజలకు ఆహ్లాదకరమైన ప్రదేశాలు చూసిన అనుభూతి కలగడంతో పాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి.

## శ్రీవారి సేవలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి


ఆలయం ఎదుట కుటుంబసభ్యులతో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.శ్రీసుధ

**తిరుమల, న్యూస్‌టుడే:** శ్రీవారిని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.శ్రీసుధ శుక్రవారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో కుటుంబసభ్యులతో కలిసి ఆలయం వద్దకు చేరుకున్న న్యాయమూర్తికి తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి మూలమూర్తి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.


మాజీ ఎంపీ చింతామోహన్


సినీనటి ఆషికా రంగనాథ్


ఓంకార్, అశ్విన్‌బాబు

## శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

**తిరుమల:** శ్రీవారిని శుక్రవారం ఉదయం బ్రేక్‌లో మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, మాజీ ఎంపీ చింతామోహన్, సినీనటి ఆషికా రంగనాథ్, సినీ నిర్మాత ఓంకార్, నటుడు అశ్విన్‌బాబు దర్శించుకున్నారు. వీరికి తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి మూలమూర్తి దర్శనం చేయించారు. అనంతరం వేదపండితులు వేదాశీర్వచనం అందించగా అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు. రాజుగారి గది-4 చిత్రం కథ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

# హస్తకళ.. శిక్షణ భళా

గ్రామీణ మహిళలకు కలంకారీలో తర్ఫీదు ● తిరుపతి ఐఐటీ వినూత్న సంకల్పం


కలంకారీ వస్త్రాలపై మహిళలు వేసిన డిజైన్లతో శిక్షకుడు జొన్నలగడ్డ నిరంజన్

**శ్రీకాళహస్తి, ఏర్పేడు, న్యూస్‌టుడే:** గ్రామీణ ప్రాంతాల్లో అక్షరాస్యతకు దూరంగా ఉన్న మహిళల్లో స్వయం ఉపాధికి బాసటగా నిలుస్తోంది తిరుపతి ఐఐటీ. సాంకేతిక విద్యతో విద్యార్థులను తీర్చిదిద్దటమే కాకుండా దత్తత గ్రామాల్లో ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల్లో భాగంగా మహిళలను ఉపాధి వైపు నడిపిస్తూ చైతన్యవంతులుగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తోంది. ప్రపంచ ప్రసిద్ధి పొందిన శ్రీకాళహస్తి కలంకారీ హస్తకళను ఇక్కడి మహిళలకు నేర్పించి ఆర్థికంగా ఎదిగేందుకు తోడ్పడుతోంది.

### చైతన్యం కల్పిస్తూ..

స్వయం ఉపాధి కల్పించే ఎన్నో రంగాలున్నా ఐఐటీ.. హస్తకళలను ఎంచుకోవడంలోనూ కారణం లేకపోలేదు. స్వదేశీయులతో పాటు విదేశీయులను అమాంతం కట్టిపడేస్తోంది శ్రీకాళహస్తి కలంకారీ. ఈ ఉత్పత్తులకు ఎనలేని డిమాండ్ ఉండటం, ఇంటి పనులు చేసుకుంటూ గృహిణులైన మహిళలు ఖాళీ సమయాల్లో కలంకారీ ఉత్పత్తులను తయారు చేయడం వల్ల ఆర్థికంగా పురోభివృద్ధిని సాధించే అవకాశముంది. వీటిని దృష్టిలో ఉంచుకుని హస్తకళలపై మహిళలకు చైతన్యం కల్పించే ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

### ఐఐటీ భాగస్వామ్యం


మహిళలకు కలంకారీ కళపై శిక్షణ ఇస్తున్న జొన్నలగడ్డ నిరంజన్

దత్తత గ్రామాలైన పంగూరు, పాగాలి, శ్రీనివాసపురం, రాజులపాళెం, నచ్చునేరి, నాగంపల్లి, ఆమందూరు, చిందేపల్లి గ్రామాల్లోని పేద కుటుంబాలకు చెందిన మహిళలను ఎంపికచేసి వాళ్లకు శిక్షణ ఇచ్చేందుకు తిరుపతి ఐఐటీ సంకల్పించింది. కలంకారీలో జాతీయస్థాయి అవార్డును సొంతం చేసుకున్న జొన్నలగడ్డ నిరంజన్‌తో ఈ మేరకు ఎంవోయూను కూడా కుదుర్చుకున్నారు. ఆ ప్రకారం ఐఐటీ ప్రాంగణంలో ఆసక్తి ఉన్న మహిళలకు కలంకారీపై ఉచితంగా శిక్షణ ఇప్పించడంతో పాటు వాళ్ల చేత కలంకారీ వస్త్రాలపై డిజైన్లు వేసే విధంగా వాళ్లను తీర్చిదిద్దారు.

### స్వయం ఉపాధి దిశగా..



గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మాకు హస్తకళలకు సంబంధించి శిక్షణను ఐఐటీ అందుబాటులోకి తీసుకువచ్చింది. కలంకారీ కళ ద్వారా ఉపాధి దిశగా అడుగులు వేసుకుని ఆర్థిక ప్రయోజనాలు పొందే విధంగా అవకాశం కల్పించారు.

– లేపాక్షి, శ్రీనివాసపురం

### సులభ సరళిలో నేర్పారు



ఎప్పటి నుంచో కలంకారీ నేర్చుకోవాలని ఆశ ఉండేది. అయితే పట్టణాలకు వెళ్లాలి.. అందుకోసం ప్రత్యేకించి శిక్షణ తీసుకోవాల్సి ఉంటుందంతో ఇప్పట్లో వీలుకాలేదు. ఐఐటీ సహకారంతో చక్కగా, ఎంతో సులభ సరళిలో కలంకారీ కళను నేర్చుకోగలిగాను.

– శంకరమ్మ, చిందేపల్లి

## అవివాహితులకు సువర్ణావకాశం

నేడు, రేపు 'ఈనాడు' పెళ్లిపందిరి ఉచిత రిజిస్ట్రేషన్



విశ్వబ్రాహ్మణ కుల అవివాహితులకు 'ఈనాడు' పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. తిరుపతి, దేవేంద్ర థియేటర్ రోడ్డు, రైల్వే కాలనీలోని 'ఈనాడు' కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరిలో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివాహం కోసం ఎదురుచూస్తున్న సంబంధిత కుటుంబీకులు శనివారం, ఆదివారం ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 వరకు తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చన్నారు. వివరాలకు 91547 72006, 80080 02165 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు. వధూవరుల బయోడేటా, ఫొటోలు పైన తెలిపిన వాట్సాప్ నంబర్లకు పంపి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్‌ను ఫోన్‌లో యాప్ ద్వారా కూడా చేసుకోవచ్చన్నారు.

## నవంబరు 28 నుంచి శ్రీపద్మావతీదేవి బ్రహ్మోత్సవాలు


పద్మసరోవరాన్ని పరిశీలిస్తున్న జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో శ్రీధర్ తదితరులు

**తిరుచానూరు:** శ్రీపద్మావతీ అమ్మవారి కార్తిక బ్రహ్మోత్సవాలు నవంబరు 28 నుంచి ప్రారంభం కానున్నట్లు తిరుపతి జేఈవో వీరబ్రహ్మం తెలిపారు. శుక్రవారం అమ్మవారి ఆలయ పరిసర ప్రాంతాల్లో బ్రహ్మోత్సవాల ముందస్తు ఏర్పాట్లపై అధికారులతో కలిసి పద్మసరోవరం, పార్కింగ్ ఏరియా ప్రాంతాలను ఆయన పరిశీలించారు. బ్రహ్మోత్సవాలను తొమ్మిది రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. తితిదే సీవీఎస్వో శ్రీధర్, సీఈ సత్యనారాయణ, ఎస్ఈ జగదీశ్వర్‌రెడ్డి, ఎస్ఈ వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఈవోలు గోవిందరాజన్, గుణభూషణ్‌రెడ్డి, సెల్వం, శివప్రసాద్, వీజీవో సదాలక్ష్మి పాల్గొన్నారు.

## 10 నుంచి ఆర్మీ నియామక ర్యాలీ

**రాయచోటి, న్యూస్‌టుడే:** వైఎస్సార్ జిల్లా కడప డీఎస్ఏ స్టేడియంలో నవంబరు 10వ తేదీ నుంచి అగ్నివీర్ ఆర్మీ నియామక ర్యాలీ నిర్వహిస్తున్నామని ఆర్మీ నియామక అధికారి కల్నల్ పునీత్‌కుమార్ పేర్కొన్నారు. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, టెక్నికల్, కార్యాలయ సహాయకులు, స్టోర్ కీపర్ టెక్నికల్, ట్రేడ్స్‌మెన్ నియామకానికి దరఖాస్తులు చేసుకుని అడ్మిట్ కార్డులు పొందిన కర్నూలు, నెల్లూరు, అనంతపురం, వైఎస్సార్, గుంటూరు, ప్రకాశం, చిత్తూరు, నంద్యాల, బాపట్ల, పల్నాడు, తిరుపతి, అన్నమయ్య, సత్యసాయి జిల్లాల్లో అర్హులైన అభ్యర్థులు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. ఎంపిక పారదర్శకంగా జరుగుతుందని ఎవరు దళారులను నమ్మి మోసపోకూడదని వివరించారు.



# పశు బీమాతో ధీమా

పూర్తయిన తొలి విడత నమోదు | పాడి రైతులకు సర్కారు బాసట


పశువుకు బీమా చేసిన అనంతరం ట్యాగ్ వేస్తున్న దృశ్యం(పాతచిత్రం)

**ఈనాడు డిజిటల్, తిరుపతి:** పశుపోషణే ఆధారంగా బతుకుతున్న పాడి రైతులకు ప్రభుత్వం బాసటగా నిలుస్తోంది. నోరు లేని జీవాలకు కూడా బీమా సౌకర్యం కల్పిస్తోంది. ప్రమాదాలు సంభవించి, రోగాల బారిన పడి పశువులు మరణించడంతో అనేకమంది రైతన్నలు జీవనాధారం కోల్పోతారు. అలాంటి వాళ్లకు భరోసానిచ్చే విధంగా ప్రభుత్వాలు ఈ పశు బీమాను అమలు చేస్తున్నాయి. 2023 జూన్‌లో ప్రారంభించిన ఈ పథకం నేటికీ సజావుగా సాగుతుండటం గమనార్హం.

### రాయితీ ఇచ్చి ప్రోత్సహిస్తూ..

జిల్లా వ్యాప్తంగా 2023-24 ఏడాది విడతల వారీగా 13,657 పశువులకు బీమా నమోదు చేశారు. ఇందుకు రూ.1.12 కోట్లు విడుదల చేశారు. అదేవిధంగా ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ నెలాఖరుకు తొలి విడతగా 1373 పశువులకు బీమా నమోదు చేయడం గమనార్హం. రైతు ఒక్కసారి బీమా చెల్లిస్తే ఆవులు, గేదెలకు మూడేళ్ల పాటు వర్తిస్తుంది. మేకలు, గొర్రెలకు కట్టే బీమా మాత్రం ఏడాది పాటు వర్తిస్తుంది. ఆవులు, గేదెలకు తొలి ఈత నుంచి పదేళ్ల వరకు బీమా కట్టొచ్చు. ఎద్దులు, దున్నలు మాత్రం పుట్టిన రెండేళ్ల తరువాత నుంచి బీమా పరిధిలోకి వస్తాయి. బీమా చెల్లించే ప్రీమియం సొమ్ములో తెల్లరేషన్ కార్డుదారులకు 80 శాతం రాయితీ, ఇతరులకు 50 శాతం రాయితీనిస్తూ ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయి.

### ఖాతాలోకే నేరుగా పరిహారం

ఉమ్మడి చిత్తూరు జిల్లా మొత్తానికి యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ ఈ బీమా పాలసీని అమలు చేస్తుంది. పశువులు ప్రమాదాలకు గురైనప్పుడు, సీజనల్ వ్యాధుల టీకా వేసుకోకుండా ఇతర రోగాల బారిన పడి చనిపోయిన వాటికి పోస్ట్‌మార్టం చేసి నివేదికలు ఇన్సూరెన్స్ కంపెనీకి పశు వైద్యులు పంపిస్తారు. తరువాత బీమా పరిహారం నేరుగా రైతుల ఖాతాల్లో పడుతుంది. బీమా చేసిన ప్రతి జంతువుకు కూడా ట్యాగ్ వేస్తారు. 2023లో జిల్లా వ్యాప్తంగా చేసిన పశు బీమాలో రేణిగుంట మండలంలోనే అత్యధికంగా 1400 పశువులకు బీమా పాలసీ చేశారు.

### నిధులు రాగానే మళ్లీ ప్రారంభిస్తాం

ఇప్పటివరకు జిల్లాలో పశు బీమా అమలులో రైతుల నుంచి మంచి స్పందనే వచ్చింది. తొలి విడత పూర్తయ్యింది. రెండో విడత నిధుల కోసం ఎదురుచూస్తున్నాం.

– డాక్టర్ నాగశిల్ప, పశు బీమా నోడల్ అధికారి, తిరుపతి

**జిల్లాలో పశు బీమా వివరాలు**

| రకం | పరిహారం (రూ.వేలల్లో) | ప్రీమియం (తెల్లరేషన్ కార్డుదారుడు) | ప్రీమియం (ఇతరులు) | గడువు |
|---|---|---|---|---|
| నాటు ఆవులు, గేదెలు | 15 | రూ.192 | రూ.480 | మూడేళ్లు |
| సంకర జాతి ఆవులు, గేదెలు | 30 | రూ.384 | రూ.960 | మూడేళ్లు |
| మేకలు, గొర్రెలు | 6 | రూ.36 | రూ.90 | ఏడాది |

## సచివాలయ ఉద్యోగిపై దాడి దారుణం

**వెంకటగిరి, న్యూస్‌టుడే:** సచివాలయ ఇంజినీరింగ్ సహాయకుడు నేలపాటి సాయికుమార్‌పై 5వ వార్డు కౌన్సిలర్ నారిశేఖర్ దాడి చేయడం హేయమైన చర్య అన్ని ఉద్యోగుల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు కృష్ణారెడ్డి అన్నారు. పట్టణంలోని 9వ వార్డు సచివాలయంలో పనిచేస్తున్న ఉద్యోగి సాయికుమార్‌ను అసభ్యపదజాలంతో దూషిస్తూ దాడి చేయడం దారుణమన్నారు. కౌన్సిలర్‌పై చర్యలు తీసుకోవాలని ఉద్యోగ సంఘం తరపున డిమాండ్ చేశారు. బాధితుడు మాట్లాడుతూ.. సచివాలయంలో ఉండగా కౌన్సిలర్ శేఖర్ ఫోన్ చేసి దొమ్మరపాళెంలో తాగునీటి సమస్యను వివరించారని, ట్యాంకర్ పంపుతామని వివరిస్తుండగా అసభ్యంగా మాట్లాడారన్నారు. కార్యాలయానికి వచ్చి దాడి చేశాడని చెప్పారు.

## ఫోన్‌చేసి మోసం: ఈవోకు భక్తుడి ఫిర్యాదు

**శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే:** అర్చకుని పేరుతో భక్తులను ఫోన్ ద్వారా మోసాలకు గురిచేయడాన్ని భక్తుడు రవికుమార్ ఆలయ ఈవో చంద్రశేఖర్ ఆజాద్‌కు ఫిర్యాదు చేశారు. ఆలయంలో పనిచేసే అర్చకుడని చెప్పి ఫోన్ చేశారని, గ్రహస్థితి బాగలేదని, రూ.4 వేలు పంపితే ముక్కంటి ఆలయంలో పూజలు నిర్వహిస్తామని చెప్పినట్లు శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని ఈవో ఆదేశాలు జారీ చేశారు. భక్తులు ఇలాంటి వాటిని నమ్మవద్దని, ముక్కంటి ఆలయం తరపున ఎప్పుడూ ఇలాంటి ఫోన్లు రావని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇలా మోసాలకు పాల్పడే వాళ్లపై కఠిన చర్యలు తీసుకుంటే మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం అయ్యే అవకాశం ఉండదు.


నాయుడుపేట నుంచి నెల్లూరుకు వెళ్లే రింగురోడ్డు


సాగరమాల రోడ్డును కలిపే రింగురోడ్డు

# రింగు రోడ్డుతో నాయుడుపేటకు నూతన కళ

తుది దశలో పనులు

**నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే:** నాయుడుపేట జాతీయ రహదారి మలుపు రింగు రోడ్లమయంగా మారుతోంది. రూ.కోట్ల నిధులతో చేపట్టిన పనులు చివరి దశలో ఉన్నాయి. రైల్వే పట్టాలపై వంతెన పనులు సైతం పూర్తి కావచ్చాయి. నాయుడుపేట నుంచి చెన్నై, బెంగళూరు, తిరుపతి, నెల్లూరు మార్గాలకు వెళ్లేందుకు మల్లాం కూడలిని కేంద్రంగా చేసుకుని చుట్టూ రింగు రోడ్లు వెలుస్తున్నాయి. నాయుడుపేట మీదుగానే ప్రధాన నగరాలకు రాకపోకలు సాగించాల్సి ఉంది. దీంతో ఈ ప్రాంతానికి ప్రాధాన్యత సంతరించుకోనుంది. ఒకటి రెండు నెలల్లో వాహనాలు రింగు రోడ్లపై రివ్వున ముందుకు సాగనున్నాయి.

### రూ.960 కోట్లతో సాగరమాల రోడ్డు..

నాయుడుపేట నుంచి తూర్పు కనుపూరు వరకూ వెళ్లే సాగరమాల రోడ్డుకు రూ.960 కోట్లతో పనులు చేస్తున్నారు. 60 మీటర్ల వెడల్పుతో ఆరు వరుసల రహదారి పనులు జరుగుతున్నాయి. నదులపై వంతెనలు, కల్వర్టుల నిర్మాణం జరుగుతోంది. ఇక నాయుడుపేట నుంచి రేణిగుంట వరకూ రూ.కోట్ల నిధులతో జరుగుతున్న 71వ రహదారి పనులు పూర్తి కావచ్చాయి. పెద్ద పెద్ద వంతెన పనులు సైతం తుది దశలో ఉన్నాయి. తిరుపతి నుంచి వచ్చే వాహనాలు చెన్నై వెళ్లేలా ఒక రింగు రోడ్డు, నెల్లూరు వెళ్లేలా మరొకటి వేస్తున్నారు. అలాగే నెల్లూరు నుంచి చెన్నై నుంచి తిరుపతి వెళ్లే వాహనాలకు అనువుగా రింగు రోడ్లు ఉన్నాయి.

## నేడు నామినేషన్ల ప్రక్రియ

**తిరుపతి(బైరాగిపట్టెడ):** తితిదే ఉద్యోగుల సహకార బ్యాంకు ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ శనివారం ప్రారంభం కానుంది. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు డైరెక్టర్ల పదవులకు నామినేషన్లు స్వీకరించనున్నారు. 20న పరిశీలన, 21న ఉపసంహరణ, 28న పోలింగ్ జరుగుతుంది. మొత్తం 6,349 మంది షేర్ హోల్డర్లు తమ ఓటుహక్కు ద్వారా ఏడుగురు డైరెక్టర్లను ఎన్నుకోనున్నారు.

**వెంకాబ్ కోళ్ల ధరలు**

| | |
|---|---|
| బ్రాయిలర్ (రైతు ధర) | 129 |
| రిటైల్ | 151 |
| లేయర్ | 120 |
| బ్రాయిలర్స్ | 219 |
| బ్రాయిలర్స్ స్కిన్ లెస్ | 249 |
| లేయర్ మాంసం | 204 |

# దారికాచిన మృత్యువు

రోడ్డు ప్రమాదంలో అటవీశాఖ ఒప్పంద ఉద్యోగి మృతి


వెంకటేష్ (పాతచిత్రం)

**తొట్టంబేడు, న్యూస్‌టుడే:** కటిక చీకట్లో జాతీయ రహదారిపై మృత్యువు దారికాచింది. యువకుడ్ని బలి తీసుకుని ఓ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ సంఘటన శుక్రవారం తెల్లవారు జామున తొట్టంబేడు మండలం పెద్దకన్నలి ఎస్టీ కాలనీ సమీపంలో రేణిగుంట-నాయుడుపేట ప్రధాన రహదారిపై చోటుచేసుకుంది. శ్రీకాళహస్తి రెండో పట్టణ సీఐ వెంకటేశులు కథనం మేరకు. . నాయుడుపేట నుంచి తిరుపతి వైపు వెళ్తున్న పర్యాటక బస్సుకు ఎదురుగా కర్రల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌లోని కర్రలు తగలడంతో బస్సు అద్దాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం రావడంతో సమీపంలోనే పెట్రోలింగ్ వాహనంలో విధులు నిర్వహిస్తున్న హోమ్‌గార్డు సుబ్రమణ్యం, కానిస్టేబుల్ అనీల్‌తో పాటు సమీపంలోనే అటవీ సంరక్షణ పరిశీలకుడిగా ఒప్పంద పద్ధతిలో విధులు నిర్వర్తిస్తున్న వెంకటేష్‌లు కలిసి అదే వాహనంలో ఘటనా స్థలానికి వెళ్లారు. పోలీసులు వాహనందిగి ఘటనపై విచారణ చేస్తుండగా వెంకటేష్ వాహనంలోనే కూర్చొని ఉండగా అటువైపుగా వేగంగా వచ్చిన గ్యాస్ సిలిండర్ లారీ పెట్రోలింగ్ వాహనంతో పాటు ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో అటవీశాఖ ఒప్పంద ఉద్యోగి వెంకటేష్(35) ఘటనా స్థలంలోనే మృతి చెందగా, ఇద్దరు కానిస్టేబుళ్లు స్వల్పంగా గాయ పడ్డారన్నారు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్ గురవయ్య, లారీ డ్రైవర్ విజయ్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకటేశులు తెలిపారు. వెంకటేష్‌కు భార్యా ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## పిడుగుపాటుకు ఇద్దరు వ్యవసాయ కూలీల మృతి


రామయ్య సుబ్రహ్మణ్యం

**నాగలాపురం, న్యూస్‌టుడే:** పిడుగుపాటుకు ఇద్దరు వ్యవసాయ కూలీలు మృతి చెందిన సంఘటన తిరుపతి జిల్లా పిచ్చాటూరు మండలం హనుమంతాపురం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్సీకాలనీకి చెందిన రామయ్య(60), సుబ్రహ్మణ్యం(55)లు వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఈ క్రమంలో రైతు దామోదరం వరి పొలంలో గట్ల వద్ద పారతో మట్టి పనులు చేస్తుండగా వర్షంతో పాటు పిడుగుపడింది. చేతిలో ఇనుపపార ఉండటంతో వీరిరువురూ పిడుగుపాటుకు గురై పొలంలోనే మృతి చెందారు. సమీపంలోని కూలీలు వీరిని గుర్తించి గ్రామంలోకి తీసుకువచ్చారు. రామయ్య భార్య పుట్టుమూగ కావడంతో కుటుంబానికి ఆయనే వయసు పెరిగినా పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. సుబ్రహ్మణ్యంకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. తమతో పాటు పనులు చేసే వ్యక్తులిరువురూ పిడుగుపాటుకు మరణించడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.

## అక్రమ ఆస్తులపై సీబీఐ విచారణ

**ఈనాడు డిజిటల్, తిరుపతి:** కర్ణాటకలోని చిత్రదుర్గ నేషనల్ హైవే అథారిటీ ప్రాజెక్టు డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీకాళహస్తికి చెందిన రావూరి శ్రీనివాసులు నాయుడుపై గతంలో అక్రమ ఆస్తుల కేసు నమోదైంది. ఆ కేసును ఆ రాష్ట్ర ప్రభుత్వం సీబీఐకి అప్పగించింది. అందులో భాగంగానే శుక్రవారం సీబీఐ అధికారులు చంద్రగిరి, శ్రీకాళహస్తి, తొట్టంబేడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సర్టిఫికెట్ కాపీలను తీసుకున్నారు. తిరుపతి కలెక్టరేట్ పరిధిలో లేఅవుట్లు ఏమైనా వేశారా? అని పరిశీలించారు.

## రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

**చంద్రగిరి:** పనపాకం రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కింద ఓ వ్యక్తి పడి ఆత్మహత్య చేసుకున్నట్లు పాకాల రైల్వే పోలీసులు తెలిపారు. పనపాకం పంచాయతీ పాకాలవారిపల్లి గ్రామానికి చెందిన పాశం రెడ్డికుమార్(45) కొంతకాలంగా పాక్షిక పక్షవాతంతో మంచం పట్టారు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం ఆయన మనోవేదనకు గురై గ్రామ సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పాకాల రైల్వే హెచ్.సి.ఉదయ్‌శేఖర్ మృతదేహాన్ని శవపరీక్షల నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చిత్తూరు రైల్వే ఎస్సై ఎ.ప్రవీణ్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## 20, 21న రాష్ట్రస్థాయి జూడో ఎంపిక పోటీలు

**శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే:** శ్రీకాళహస్తి పట్టణంలోని ఆర్‌పీబీఎస్ జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 20, 21 తేదీల్లో జూడో రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొనే జట్టును ఎంపిక చేయనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయిని రాజేశ్వరి తెలిపారు. ఈ పోటీలు స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి బాబు నేతృత్వంలో నిర్వహించనున్నట్లు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. 13 జిల్లాల నుంచి 130 మంది బాలురు, 130 మంది బాలికలు, శిక్షకులతో కలసి 350 మంది వస్తున్నారన్నారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడా కారులు అస్సాం, జమ్ముకాశ్మీర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

## జేఎన్‌టీయూ(ఏ) తైక్వాండో జట్ల ఎంపిక


ఎంపికైన జేఎన్‌టీయూఏ జట్లు

**చిత్తూరు (క్రీడలు), న్యూస్‌టుడే:** జేఎన్‌టీయూ(ఏ) తైక్వాండో జట్ల ఎంపిక పోటీలు చిత్తూరులోని శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ పోటీలకు ఐదు జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. వీరికి ఎంపిక పోటీల్ని నిర్వహించి మహిళల విభాగంలో ముగ్గురు, పురుషుల విభాగంలో ఏడుగురిని తుది జట్లకు ఖరారు చేశారు. ఎంపికైన ఆటగాళ్లు పంజాబ్ రాష్ట్రం అమృతసర్‌లో డిసెంబర్‌లో జరగనున్న అఖిల భారత భారత అంతర విశ్వవిద్యాలయాల టోర్నీలో తలపడనున్నాయని కళాశాల ప్రిన్సిపల్ మోహన్‌బాబు, జేఎన్‌టీయూఏ క్రీడల బోర్డు కార్యదర్శి జీబీరెడ్డి తెలిపారు. మనోహర్‌నాయుడు, లోకనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్తు ఛార్జీల పెంపు తగదు



ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

**తిరుపతి(నగరం), న్యూస్‌టుడే:** విద్యుత్తు వినియోగదారులపై ఇంధన సర్దుబాటు ఛార్జీల పేరుతో భారం మోపేందుకు ప్రభుత్వం ప్రయత్నించడం తగదని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు అన్నారు. శుక్రవారం నగరంలోని ఏపీఎస్పీడీసీఎల్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కూటమి ప్రభుత్వం వినియోగదారులపై రూ.8,114 కోట్లు భారాన్ని వేయడం దారుణమన్నారు. సర్దుబాటు ఛార్జీలపై ప్రభుత్వం పునరాలోచించాలని ఆయన డిమాండ్ చేశారు. నాయకులు సుబ్రహ్మణ్యం, జయచంద్ర, సాయిలక్ష్మి, వేణుగోపాల్, బుజ్జి, చిన్న, నరేంద్ర, చినబాబు, కేఆర్ సుబ్రహ్మణ్యం, రవి, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి

•తిరుపతి • చంద్రగిరి



## తిరుచ్చిపై శ్రీపద్మావతీ అమ్మవారి విహారం

**తిరుచానూరు, న్యూస్‌టుడే:** శ్రీపద్మావతీ అమ్మవారు శుక్రవారం సాయంత్రం తిరుచ్చిపై తిరుమాడ వీధుల్లో ఊరేగారు. ఇందులో భాగంగా ఆలయంలో ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అలంకార శోభితురాలైన అమ్మవారు తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు అభయం ప్రదానం చేశారు. వాహనసేవలో సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఆర్జితం, ప్రసాదాల ఇన్‌స్పెక్టర్లు గణేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## బాధ్యతల స్వీకరణ



వేంకటేశ్వరప్రసాద్

**తిరుపతి(నగరం), న్యూస్‌టుడే:** తిరుపతిలోని నీటిపారుదలశాఖ కార్యాలయంలో ఈఈగా పసుపులేటి వేంకటేశ్వరప్రసాద్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. చంద్రగిరి డీఈఈగా పని చేస్తున్న ఆయన్ని ప్రభుత్వం తిరుపతికి ఈఈగా బదిలీ చేసింది.

**మేమున్నాం.. మీకు తోడుగా..** (10 AM TO 1 PM)
తిరుపతి : 80080 20003
చంద్రగిరి : 80085 74561
పాకాల : 80085 74563

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే:

**సమస్య:** ఆర్సీ రోడ్డులో కొత్తగా నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జి ఇటీవల వర్షానికి గుంతలతో నిండిపోయింది. నాణ్యత లేకుండా బ్రిడ్జిని నిర్మించారు. **-మునిరత్నం, స్థానికుడు**

**సమాధానం:** పరిశీలించి గుంతలను పూడ్చేందుకు చర్యలు చేపడతాం. **-శ్యాంసుందర్, ఎస్ఈ, నగరపాలిక**

## పారిశుద్ధ్య పనులు

స్పందనకు వందనం

**తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే:** 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన శుక్రవారం 'ఈనాడు'లో ప్రచురితమైన రెండు వార్తలకు నగరపాలిక వైద్యాధికారి డా.యువ అన్వేష్ స్పందించారు. రైల్వే కాలనీలో ఐదో క్రాస్‌లో మురుగు నీరు ఇళ్లలోకి ప్రవేశిస్తున్న సమస్యను పరిష్కరించారు. అబ్బన్న కాలనీలో వర్షానికి మునిగిన ప్రాంతంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు.



బహుమతులు అందుకున్న విజేతలతో ఉపాధ్యాయులు

## బాలల సృజనకు పదును



వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

**తిరుపతి(బైరాగిపట్టెడ) న్యూస్‌టుడే:** 'ఈనాడు' ఆధ్వర్యంలో స్థానిక రైల్వే కాలనీ సప్తగిరి నగర్‌లోని మాతృశ్రీ ఆంగ్ల మాధ్యమం పాఠశాలలో శుక్రవారం 8, 9, 10 తరగతుల విద్యార్థులకు 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులు పలు కోణాల్లో విశ్లేషించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విజేతలుగా నిలిచిన పి.నిఖిల్, జి.దర్శిని, కె.దినీషాకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.సుధాకరనాయుడు విద్యార్థులను అభినందించారు.

## కాలువ హద్దులు ఏర్పాటు చేయండి

**తిరుపతి(గ్రామీణ), న్యూస్‌టుడే:** పాతకాల్వ చెరువు నుంచి ఇతర చెరువులకున్న సప్లై ఛానళ్లను సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని పాతకాల్వ తెదేపా నాయకుడు శివకుమార్ ఆధ్వర్యంలో నాయకులు తహసీల్దార్ రామాంజులునాయక్‌కు శనివారం వినతిపత్రం సమర్పించారు. సి.మల్లవరం పంచాయతీలోని సప్లై ఛానల్ ద్వారా పాతకాల్వ, గొల్లపల్లి, రామానుజపల్లి, తుమ్మలగుంట గ్రామాలకు గొలుసుకట్టు సప్లై ఛానళ్లు ఉన్నాయని నాయకులు తెలిపారు. గతంలో సి.మల్లవరం వద్ద ఉన్న సప్లై ఛానల్ నుంచి పలు చెరువులకు నీళ్లు చేరేవన్నారు. ప్రస్తుతం ఈ కాలువలు కబ్జాకు గురయ్యాయని, వీటిని సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని కోరారు.

# ఆక్రమణలకే అండ

☛ విద్యానగర్-తాటితోపు మధ్య జాతీయ రహదారి కబ్జా
☛ చోద్యం చూస్తున్న ఆయా శాఖలు

✸ తిరుపతి నుంచి చంద్రగిరికి వెళ్లే జాతీయ రహదారికి ఆనుకుని విద్యానగర్ కాలనీ కూడలిలో విశాలమైన రూ.కోట్ల విలువైన ఖాళీ స్థలం ఉంది. కొందరు వ్యక్తులు ఇటీవల ఒక్కొక్కటిగా దుకాణాలు, బంకులను ఇక్కడ ఏర్పాటు చేసుకుంటూ స్థలాన్ని అన్యాక్రాంతం చేసే యత్నాలు ప్రారంభించారు. ఈ ఖాళీ స్థలానికి ఆనుకుని ఉన్న వ్యవసాయ వర్సిటీ పరిశోధన స్థానం అధికారులు లోనికి వెళ్లేందుకు దారి లేకుండా చేస్తారనే భయంతో దుకాణాల ఏర్పాటుపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇంతలో సర్పంచి, పంచాయతీ కార్యాలయం తరపున స్థానికులు కొందరు శుక్రవారం పెద్దసంఖ్యలో అక్కడికి చేరుకుని ఆక్రమణల్ని కొనసాగించేదే అంటూ భీష్మించుకుని కూర్చున్నారు. ఈ రోడ్డు మొత్తం ఉన్న అన్ని దుకాణాల్ని తొలగిస్తేనే ఆక్రమణలను ఆపుతామని వారు తేల్చిచెప్పారు. విద్యానగర్ కాలనీ కూడలి నుంచి తాటితోపు వరకు తాత్కాలిక ఆక్రమణలు, శాశ్వత భవనాలతో చేసిన ఆక్రమణలు 70కి పైగా జాతీయ రహదారి స్థలంలోనే ఉన్నాయని అంటున్నారు. వీటి విలువ రూ.కోట్లలో ఉండడంతో స్థానికంగా రూ.లక్షలు చేతులు మారుతున్నట్లు చెబుతున్నారు.



ఆక్రమణ స్థలంలో గుమికూడిన అధికారులు, ఆక్రమణదారులకు అండగా వచ్చిన స్థానికులు

**తిరుపతి(నగరపాలిక, గ్రామీణ), న్యూస్‌టుడే:** తిరుపతి గ్రామీణ మండలం కబ్జాలు, ఆక్రమణలకు పెట్టింది పేరుగా మారింది. కాలువలు, చెరువులు, ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురవుతున్నా పట్టించుకునే నాథుడు కరవయ్యారు. ఐదేళ్లుగా సాగిన కబ్జాల పరంపరలో కోట్లాది రూపాయల విలువ చేసే రహదారుల్ని సైతం కబ్జా చేసేస్తున్నారు. తిరుపతి శివారులోని విద్యానగర్ కాలనీ నుంచి తాటితోపు వరకు జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న కోట్లాది రూపాయలు విలువ చేసే రహదారి భూములు అన్యాక్రాంతం అవుతున్నా.. కాపాడాల్సిన పంచాయతీ పెద్దలు, అధికారులు, జాతీయ రహదారుల శాఖ అధికారులు చోద్యం చూస్తుండటం విశేషం. భవిష్యత్‌లో రహదారి విస్తరణకు అవకాశం లేకుండా ఫుట్‌పాత్ వరకు రహదారిని ఆక్రమించుకుని దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు.

### ఆలయాల పేరుతో వెలిసిన దుకాణాలు

గత ఐదేళ్ల కాలంలో తాత్కాలిక నిర్మాణాల స్థానంలో శాశ్వత నిర్మాణాలు చేపట్టడం ప్రారంభించారు. మొదట ఓ ఆలయ నిర్మాణం ప్రారంభించి దానికి అనుబంధంగా నాలుగైదు గదులను నిర్మించి దుకాణాలుగా మార్చి అద్దెలకు ఇవ్వడం అనే కొత్త సంప్రదాయాన్ని తెరపైకి తెచ్చారు. ఈ క్రమంలో నాలుగైదు ఆలయాలను రోడ్డును ఆనుకుని నిర్మించారు. ఫుట్‌పాత్‌లను సైతం వదలకుండా అన్నదాన సత్రాలు, ఆలయాలు పేరుతో దుకాణాలను నిర్మించి అద్దెకు ఇస్తున్నారు. అందుకు గతంలో స్థానికంగా ఉన్న వైకాపా నేతలు పూర్తి అండగా నిలిచారు. ఈ క్రమంలో వర్షపునీటి కాలువల్ని సైతం మట్టితో నింపేయడంతో పలు ప్రాంతాలను ముంపనకు గురి చేసే చేసే ప్రమాదం కూడా ఉంది. గతంలో అప్పటి చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి బ్యానర్లు ఏర్పాటు చేయడంతో ప్రశ్నించేందుకు సాహసించలేకపోయారు. ఇదే అదనుగా కొందరు ప్రస్తుతం ఖాళీగా ఉన్న స్థలాల్ని తమ ఆధీనంలోకి తీసుకునేందుకు యత్నిస్తున్నారు. ఈ దుకాణాల అద్దెలు వసూలు చేసేదెవరు, ఎవరు అనుమతి తీసుకుంటే రహదారి ఆక్రమించుకోవచ్చో స్థానికులకు విదితమే.

### తాఖీదులకే పరిమితం

జాతీయ రహదారి కబ్జా వెనుక ఓ మాఫియా ఉందనే విషయం స్థానికులకు ఎరుకే. రూ.కోట్ల విలువైన రహదారిని కబ్జా చేస్తున్నా.. పంచాయతీ అధికారులకు ఫిర్యాదులు వచ్చినా తాఖీదులు ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారు. జలవనరుల శాఖ కబ్జాలను కన్నెత్తి చూడడం లేదు. జాతీయ రహదారుల శాఖ పట్టనట్లు వ్యవహరిస్తోంది. ఇదిలాగే కొనసాగితే భవిష్యత్‌లో రోడ్డు కూడా మిగిలే పరిస్థితి లేదు.

## నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

**తిరుపతి(నగరం), న్యూస్‌టుడే:** విద్యుత్తు లైన్ల మరమ్మతు పనుల్లో భాగంగా శనివారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని డీఈఈ చంద్రశేఖర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు న్యూబాలాజీ కాలనీ, ఇస్కాన్ ఆలయం, యశోదనగర్, సప్తగిరికాలనీ, రైల్వే కాలనీ, గాంధీరోడ్డు, న్యూమారతినగర్, ఎల్ఎస్‌నగర్, టౌటానగర్, పెద్దకాపు లేఔట్, తిరుచానూరు గ్రామీణం, చిగురువాడ, కృష్ణారెడ్డికాలనీ, హథీరాంజీకాలనీ, బైరాగిపట్టెడ, ఆర్సీరోడ్డు, వీవీమహల్, లాలామహల్, కరకంబాడి, మంగళం, దామినేడు, కొర్లగుంట తదితర ప్రాంతాల్లో సరఫరా నిలిపివేయనున్నారు.

**రామచంద్రాపురం:** మండలంలోని కుప్పంబాదూరు, వెంకట్రామాపురం, నడవలూరు, నెత్తకుప్పం విద్యుత్తు సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు శనివారం విద్యుత్తు సరఫరాను ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిలిపివేస్తున్నట్లు ఏఈ గిరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్తు తీగలకు తాకుతున్న చెట్ల కొమ్మలు, తీగలు తొలగింపు, మరమ్మతు పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. ప్రజలు సహకరించాలని కోరారు.



కాలువలో ప్రవహిస్తున్న నీరు

## మొరవ పారుతున్న పొట్లకోన చెరువు

**చంద్రగిరి, న్యూస్‌టుడే:** మండలంలోని కల్‌రోడ్డుపల్లి పంచాయతీ ఆముదాలకోన ఎస్టీకాలనీ సమీపంలోని పొట్లకోన చెరువు నిండి మొరవ పారుతోంది. వరద నీరు గడ్డకిందపల్లి సమీపంలోని స్వర్ణముఖి వాగులోకి ప్రవేశించింది. గురువారం రాత్రి కుండపోతగా వర్షం కురవడంతో కల్‌రోడ్డుపల్లి పంచాయతీ ఆముదాలకోన ఎస్టీకాలనీ సమీపంలోని అడవుల్లో నుంచి వర్షపునీరు పొట్లకోన చెరువులోకి చేరింది. చెరువు నిండి మొరవ ద్వారా సుమారు 2.5 కి.మీ దూరంలోని స్వర్ణముఖి నదిలోకి ప్రవహించింది. దీంతో నేలబావులు, గొట్టపు బావుల్లో నీటి మట్టం పెరుగుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## సాంకేతిక నైపుణ్యాలు అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ నాదమునిరెడ్డి

**తిరుపతి(మంగళం), న్యూస్‌టుడే:** విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను అందిపుచ్చుకుని, కోర్సులను విజయవంతంగా పూర్తి చేయాలని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.నాదమునిరెడ్డి సూచించారు. నగర సమీపంలోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం రెండురోజుల పాటు నిర్వహించే టెక్నికల్ సింపోజియం త్రిష్న-2కె24 కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. సుమారు 500 విద్యార్థులు పాల్గొని వారి ప్రదర్శనలను ప్రదర్శించారు. ఈసీఈ విభాగాధిపతి ఎన్.పుష్పలత, అధ్యాపకులు పాల్గొన్నారు.

## తిరుమలకు హారంలా.. మేఘమాల

శేషాచలం అడవిలో తెల్లటి మేఘాలు ప్రకృతి రమణీయంగా.. తిరుమలకు హారంలా కనువిందు చేస్తున్నాయి. వర్షం తగ్గడంతో మంచు దుప్పటి కప్పుకొంది. ఘాట్‌రోడ్ల మీదుగా తిరుమల చేరుకుంటున్న భక్తులు ఈ సౌందర్యాన్ని ఆస్వాదిస్తున్నారు. -న్యూస్‌టుడే, తిరుమల



## అవగాహనతోనే మెరుగైన ప్రజా సేవ

**తిరుపతి(గ్రామీణ), న్యూస్‌టుడే:** పంచాయతీ విధివిధానాలపై అవగాహనతోనే ప్రజాప్రతినిధులు మెరుగైన ప్రజా సేవ చేయగలరని ఎంపీడీవో రామచంద్ర పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో శుక్రవారం ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు పంచాయతీ విధి విధానాలపై శిక్షణ ఇచ్చారు. ప్రభుత్వ పథకాలు, పంచాయతీరాజ్ చట్టాల గురించి తెలుసుకుని, క్షేత్రస్థాయిలో అమలు చేసినప్పుడు మీ పదవులకు గుర్తింపు ఉంటుందన్నారు. ఈవోపీఆర్డీ మాధురి, శిక్షకులు జానకిరామ్, శశిరేఖ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ యశోద తదితరులు



ప్రభుత్వ స్థలం ఆక్రమించి వేసుకున్న పశువుల పాకలు

## దర్జాగా ప్రభుత్వ స్థలాల కబ్జా

**చంద్రగిరి, న్యూస్‌టుడే:** భూముల విలువ రెట్టింపవుతుండటంతో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుని ఏకంగా దుకాణాలు, పశువుల పాకలు, రేకుల షెడ్లు ఏర్పాటు చేసుకున్నారు. మండల కేంద్రమైన చంద్రగిరిలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, కళాశాల ప్రహరీ పక్కనే వైకాపా పాలనలో కొందరు తొలుత పేడదిబ్బలు వేసుకుంటూ అదే ప్రదేశంలో పశువుల పాకలు ఏర్పాటు చేసుకున్నారు. మరొకరు ఏకంగా దుకాణం ఏర్పాటు చేసుకుని దానికి విద్యుత్తు కనెక్షన్ తీసుకున్నారు. మరో ప్రదేశంలో ప్రహరీ పక్కనే రేకుల షెడ్డుతోపాటు ద్విచక్ర వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేసుకున్నారు. ప్రధానంగా ప్రహరీకి అవతలి వైపు నూకలగుంట నుంచి మురుగునీటి కాలువ ప్రవహిస్తోంది. ప్రస్తుతం చంద్రగిరి పట్టణంలోని నూకలగుంటకు వెళ్లే మార్గంలో అంకణం రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు ధర పలుకుతోంది. ప్రస్తుతం ప్రహరీ పక్కగా ఉన్న సుమారు 50 అంకణాల ప్రభుత్వ భూమిని దర్జాగా కబ్జా చేసి పశువుల పాకలు, దుకాణం, రేకుల షెడ్లు ఏర్పాటు చేసుకున్నారు. నిత్యం ఇదే మార్గంలో రైతు సేవా కేంద్రం, గ్రామ సచివాలయ ఉద్యోగులు తిరుగుతున్నారు. అటు రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు సైతం పట్టించుకోవడం లేదు.

### పరిశీలించి చర్యలు చేపడతాం

ప్రభుత్వ స్థలాలు, మురుగునీటి కాలువగట్లు ఆక్రమించడం నేరం. వీఆర్వోలతో ఆక్రమిత స్థలాలను పరిశీలించి నివేదికలు రూపొందించి జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తదుపరి చర్యలు తీసుకుంటాం.
**- ఎస్.సుబ్బయ్య, తహసీల్దారు, చంద్రగిరి**

## పెద్దచెరువుకు వర్షపు నీటి మళ్లింపు

**పాకాల, న్యూస్‌టుడే:** గత మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పాకాల పెద్దవంక జలకళ సంతరించుకుంది. జలవనరుల శాఖ డీఈ రెడ్డిప్రసాద్, పంచాయతీ కార్యదర్శి మోతి తదితరులు శుక్రవారం ఉదయం ఊట్లవారిపల్లి రైల్వే వంతెన వద్ద వరద పరిస్థితిని పరిశీలించారు. వాగు ప్రవాహంలో కొట్టుకు వచ్చిన చెత్త చెదారాలు వంతెన వద్ద ఇరుక్కోకుండా సిబ్బంది ద్వారా యంత్రాల సాయంతో తొలగిస్తున్నారు. ఈ నీటిని పాకాల పెద్దచెరువుకు మళ్లిస్తున్నట్లు అధికారులు తెలిపారు. దామలచెరువు పెద్దవంకలోనూ నీటి ప్రవాహం మొదలవడంతో పత్తిపాటివారిపల్లి సమీపంలోని కోనేటిచెరువు, మల్లబ్బగారిపల్లి సమీపంలోని కుళ్లపురెడ్డి చెరువుకు మళ్లించారు.



నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న అధికారులు

## అవిలాల.. పట్టించుకోరేల



వినాయక నగర్‌లో గుంతలమయంగా రహదారి

**తిరుపతి(గ్రామీణ), న్యూస్‌టుడే:** అవిలాల గ్రామంలోని పలు రహదారులు దుస్థితికి చేరాయి. ప్రజలు రాకపోకలు సాగించే చోట గత ప్రభుత్వం సీసీ రోడ్లకు ప్రాధాన్యమివ్వకపోగా తమ అనుయాయులు ఉన్నచోట వేసింది. మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు గుంతల రోడ్లతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. తిరుపతి గ్రామీణ మండలంలో అవిలాల మేజర్ పంచాయతీ. ఆర్థికంగా ఎటువంటి ఇబ్బంది ఉండదు. తిరుపతికి ఆనుకుని ఉండటంతో ఇక్కడ అపార్టుమెంట్లు, వాణిజ్య సముదాయాలు వందల సంఖ్యలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో పంచాయతీకి పన్నుల రూపంలో రూ.లక్షల్లో ఆదాయం సమకూరుతోంది. వైకాపా ప్రభుత్వంలో తుడా, పంచాయతీ నిధులను సీసీ రోడ్లకు, యూడీఎస్ నిర్మాణానికి వినియోగించారు. పేదలు ఎక్కువగా ఉన్న వినాయక నగర్ ప్రాంతంలో అసంపూర్తిగా పనులు వదిలేశారు. క్షత్రియనగర్, ఆంధ్రాబ్యాంక్‌లోని రెండు వీధులు, సుబ్బయ్య కాలనీలో రోడ్లు సరిగా లేకున్నా పట్టించుకోలేదు. రెవెన్యూ, పంచాయతీ అధికారులు స్పందించి గ్రామంలో సిమెంట్ రోడ్లు ఏర్పాటుచేయాలని, రేషన్ వాహనం ప్రతివీధికి వచ్చేలా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## నేత్ర వైద్య శిబిరం

**చిన్నగొట్టిగల్లు, న్యూస్‌టుడే:** మండలంలోని చెరువుముందరపల్లిలో పుట్టారెడ్డి నారాయణరెడ్డి జ్ఞాపకార్థం శుక్రవారం ఉచిత కంటి చికిత్స వైద్య శిబిరాన్ని దాత డమరుకనాథరెడ్డి ఏర్పాటు చేశారు. రుయా ఆసుపత్రి నేత్ర వైద్య నిపుణులు డా.చలపతి ఆధ్వర్యంలో డా.శ్రీలక్ష్మి, సిబ్బంది సుమారు 150 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించారు. వారిలో 15 మందిని రుయా ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో విశ్వనాథరెడ్డి, రెడ్డప్పరెడ్డి, లోకనాథరెడ్డి పాల్గొన్నారు.



కొనుగోలుదారుకు వాహన తాళం అందజేస్తున్న డిప్యూటీ కలెక్టర్ చంద్రశేఖర్‌నాయుడు తదితరులు

## మార్కెట్లోకి కొత్త ద్విచక్ర వాహనం

**తిరుపతి(ఆటోనగర్), న్యూస్‌టుడే:** ఆటోమొబైల్ సంస్థ పయాజియోకు చెందిన ఏప్రిలియా ఆర్ఎస్ 457 బైక్‌ను నికీ మోటార్స్ యాజమాన్యం తిరుపతి మార్కెట్లోకి విడుదల చేసింది. రేణిగుంట రోడ్డులోని షోరూమ్‌లో శుక్రవారం తిరుపతి డిప్యూటీ కలెక్టర్ చంద్రశేఖర్‌నాయుడు చేతుల మీదుగా కొనుగోలుదారుడు పునీత్‌కృష్ణకు వాహన తాళాలను అందజేశారు. నికీ మోటార్స్ సీఈవో నాగభూషణ్‌రెడ్డి, షోరూం ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఇల్లు ఆక్రమించి బయటకు గెంటేశారు

**ఓ వృద్ధురాలి ఆవేదన**

**చంద్రగిరి, న్యూస్‌టుడే:** తిరుపతి గ్రామీణ మండలం సి.మల్లవరం గ్రామానికి చెందిన గంపల ధనమ్మకు చంద్రగిరి పట్టణం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు ఎదురుగా పీఎన్ రోడ్డు పక్కన సర్వే నంబరు 61/2లో సుమారు 20 సెంట్ల స్థలంలో ఉంది. దీన్ని ఆమె దుకాణంగా మార్పిడి చేసింది. దీనిని ఓ వ్యక్తికి అద్దెకు ఇచ్చింది. ఆ వ్యక్తి కొంతకాలం ఫర్నీచర్ వ్యాపారం నిర్వహించి ఖాళీ చేసి మరోచోట ఏర్పాటు చేసుకున్నారు. అప్పటి నుంచి దుకాణానికి తాళం వేసి ఆమె స్వగ్రామంలో ఉంటోంది. ఇంటికి సంబంధించి పంచాయతీ పన్నులు, విద్యుత్తు బిల్లులు ఆమె పేరుతోనే ఉన్నాయి. ఈ క్రమంలో ఆమెకు తెలియకుండా పంచాయతీలో ఇంటి పన్ను, విద్యుత్తు మీటరు మార్చుకున్నారు. శుక్రవారం ఉదయం దుకాణానికి వేసి ఉన్న తాళాలను పగులగొట్టి ఆక్రమించారన్న విషయం తెలుసుకున్న ధనమ్మ సంఘటనా స్థలికి చేరుకుని వారిని ప్రశ్నించగా.. వారు తనను దుకాణం నుంచి బయటకు గెంటివేశారని ఆవేదన వ్యక్తం చేసింది. స్థానికులు ఆమెకు సంఘీభావం తెలిపి ఆందోళన చేశారు. న్యాయం చేయాలని దుకాణం బయట బైఠాయించి ఆమె నిరసన తెలిపారు.




ఆవేదన వ్యక్తం చేస్తున్న ధనమ్మ, స్థానికులు

## రాత్రంతా డివైడర్ మధ్యలోనే గేదెలు

స్థానిక శివశక్తి కల్యాణ మండపం ప్రాంతంలో నివాసం ఉన్న స్థానికులు పెళ్లికి వెళ్తూ పశువులను ఇంటి ఆవరణలో వదిలి వెళ్లారు. గురువారం రాత్రి ఇంటి నుంచి వచ్చేసిన పశువులు ఎలా వెళ్లాయో తెలియదు.. తిరుపతి ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ఎదురుగా అటు ఇటు గ్రిల్స్ ఉన్న డివైడర్ మధ్యలో నిలిచిపోయాయి. ఎటూ వెళ్లలేని స్థితిలో ఉండటంతో ఇక్కడ విధుల్లో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్, అగ్నిమాపక అధికారి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో గ్రిల్స్ కట్ చేసి పశువులను బయటకి పంపారు.
**-ఈనాడు, తిరుపతి**



యంత్రంతో కమ్మీలు తొలగిస్తున్న అగ్నిమాపక సిబ్బంది



డివైడర్ నుంచి బయటికి వస్తున్న గేదె

## నేడు కలాం పురస్కారాల ప్రదానం

**తిరుపతి(భవానీనగర్), న్యూస్‌టుడే:** కలాం ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాం జయంతి సందర్భంగా మహతి కళాక్షేత్రంలో కలాం పురస్కారాల ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు భాష సిరివెల్ల తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి బెంగళూరు ఇస్రో కేంద్రం ఓఎస్డీ కేవీ లక్ష్మణ్‌కుమార్, శాస్త్రవేత్తలు భవానీకుమార్, కరుణానిధి తదితరులు హాజరవుతారని చెప్పారు. సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశామన్నారు.

## కేంద్ర మంత్రికి ఎంపీ వినతి

**తిరుపతి(జీవకోన), న్యూస్‌టుడే:** రాష్ట్రంలో దిశ కమిటీ సమావేశాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ మద్దిల గురుమూర్తి కోరారు. శుక్రవారం దిల్లీలో కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ కార్యదర్శి శైలేష్‌కుమార్ సింగ్‌కు ఎంపీ వినతిపత్రం అందజేశారు.

## వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

**భాకరాపేట, న్యూస్‌టుడే:** కాలానుగుణ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా.హేమంత్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఉలసలవారిపల్లిలో కుష్టు, డెంగీ, మలేరియా వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ డిప్యూటీ డెమో కిరణ్‌కుమార్, అమరనాథరెడ్డి, సుబ్రహ్మణ్యం, లక్ష్మి, ప్రజలు పాల్గొన్నారు.

## ఏటీఎం చోరీకి విఫలయత్నం

**తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే:** తిరుపతి రూరల్ మండలం చెర్లోపల్లి వద్ద ఏటీఎంలో నగదు చోరీకి దొంగలు విఫలయత్నం చేసినట్లు సీఐ చిన్న గోవిందు తెలిపారు. గురువారం రాత్రి చెర్లోపల్లి శ్రీఆంజనేయస్వామి ఆలయం ఎదురుగా ఉన్న ఏటీఎంలో దొంగలు పడ్డారు. రాడ్లతో మిషన్ తెరిచేందుకు ప్రయత్నించారు. ఎంతకూ తెరుచుకోకపోవడంతో వెనుదిరిగారు. స్థానికుల సమాచారంతో సీఐ సిబ్బందితో అక్కడికి చేరుకుని పరిశీలించారు. సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.

## ఎస్వీయూ ప్రాంగణం.. హరిత శోభితం



ఎస్వీయూ పరిపాలన భవనం ఎదుట..

శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రాంగణం ఎత్తైన చెట్లు.. ఇటీవల నాటిన మొక్కలు, గడ్డితో పచ్చదనం సంతరించుకుని హరిత శోభితమై కనిపిస్తోంది. వర్సిటీకి వచ్చే విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులను రహదారికి ఇరువైపులా పచ్చని చెట్లు స్వాగతం పలుకుతున్నాయి. స్వచ్ఛంద సంస్థలు, వివిధ సందర్భాల్లో నగరవాసులు, విద్యార్థులు నాటిన మొక్కలను సంరక్షిస్తున్నారు. శ్రీనివాస ఆడిటోరియం చుట్టూ పచ్చదనం కనువిందు చేస్తోంది. గ్రంథాలయం వద్ద ఎత్తైన చెట్ల కింద విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. వసతి గృహాల వద్ద ఎత్తైన చెట్లు గాలివానకు పడిపోకుండా కాండం వద్ద రాళ్లుపేర్చి సంరక్షిస్తున్నారు. పరిపాలన భవనం ఎదుట పచ్చని చెట్లు ఆహ్లాదపరుస్తున్నాయి. **- ఈనాడు, తిరుపతి**



గ్రంథాలయం వద్ద ఎత్తైన చెట్లు

# శ్రీకాళహస్తి

•శ్రీకాళహస్తి •సత్యవేడు

## ఆర్టీసీలో ఖాళీలు భర్తీ చేయాలి

తొట్టంబేడు, న్యూస్‌టుడే: ఆర్టీసీలో ఖాళీలను భర్తీచేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆర్టీసీ ఉద్యోగ, కార్మికుల సంక్షేమ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వంలోనూ ఉద్యోగులకు న్యాయం జరగలేదన్నారు. ఇప్పటికైనా స్పందించి ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కట్ట సుబ్రహ్మణ్యం, రాష్ట్ర గౌరవాధ్యక్షులు జిలానీ బాషా, జిల్లా కార్యదర్శి శివకుమార్, బాలసుబ్రహ్మణ్యం, మల్లికార్జున, సుధాకర్ పాల్గొన్నారు.

## వేడుకగా పద్మావతమ్మకు ఊంజల్ సేవ

నారాయణవనం : స్థానిక శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో పద్మావతమ్మకు ఊంజల్‌సేవను వేడుకగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం మూలవర్లకు అభిషేకం అనంతరం నిత్యకైంకర్య పూజలను చేపట్టారు. సాయంత్రం అమ్మవారిని నూతన పట్టువస్త్రాలు, పుష్పాలతో అలంకరించి సంకీర్తనల నడుమ ఊయల సేవ చేపట్టారు. కార్యక్రమంలో ఆలయాధికారులు నాగరాజు, భరత్, అర్చకులు శ్రీధర్ భట్టాచార్య, శ్రీనివాసరామయ భట్టాచార్య, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.





## ఘనంగా ఉయ్యాలోత్సవం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ముక్కంటి ఆలయంలో మనోన్మణి అమ్మవారి ఊరేగింపు ఉత్సవం ఘనంగా జరిగింది. జ్ఞానాంబికా ఆలయానికి ఎదురుగా అమ్మవారిని శుక్రవారం ఉయ్యాలపై ఉంచారు. ధూప, దీప, నివేదనలు సమర్పించారు. అనంతరం మేళ తాళాలు, భక్తుల జయజయధ్వానాల నడుమ అమ్మవారికి ప్రాకారోత్సవాన్ని జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఊరేగింపుగా వస్తున్న మనోన్మణి

## సొంత నిధులతో రహదారి విస్తరణ

ఏర్పేడు, న్యూస్‌టుడే: మండలంలోని గుడిమల్లంలో వెలసిన శ్రీపరశురామేశ్వర స్వామి ఆలయానికి చేరుకునే భక్తులకు ఉపయోగకరంగా ఆలయ ఛైర్మన్ గిరినాయుడు సొంత నిధులతో రహదారి విస్తరణకు శ్రీకారం చుట్టారు. ఇరుకు రహదారి కావడంతో వాహనాల రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. దీన్ని గుర్తించిన గిరినాయుడు రూ.5లక్షల సొంత నిధులతో రహదారిని విస్తరణ చేపట్టారు. ఈ సందర్భంగా రోడ్డు భవనాల శాఖ అధికారులతో పాటు స్థానికులు గిరినాయుడిని అభినందించారు.



గుడిమల్లం రహదారిని విస్తరణ చేయిస్తున్న గిరినాయుడు

# హోలికా.. సాగాలిక

● జోరందుకున్న రబీ పనులు ● వరి సాగుకు సన్నాహాలు



తొట్టంబేడు మండలం రామచంద్రాపురం సమీపంలో దుక్కులు దున్నుతున్న రైతు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ఏటా నవంబరు వర్షాకాలంలో పలకరించే వరుణుడు వాయుగుండం రూపంలో ముందుగానే కరుణచూపాడు. బావులు, చెరువులు, కాల్వల్లో సాగునీటి జలాలు నిల్వ చేరడంతో రబీ రైతులు ముందస్తుగా సాగుకు శ్రీకారం చుట్టేందుకు సన్నాహాలు సిద్ధం చేసుకుంటున్నారు. శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజక వర్గాల పరిధిలోని తెలుగుగంగ పరివాహక ప్రాంతంలో పలు చోట్ల నార్లు పోసుకుని నాట్లు నాటు కుంటుంటే.. మిగిలిన చోట్ల నార్లు పోసుకునేందుకు ఏర్పాట్లు సిద్ధం చేసుకుంటున్నారు.

### వరిపైనే గురి

ఈ దఫా ముందస్తుగా ఆశించిన మేర వర్షం పడటంతో రైతులు వరి సాగుకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. వరికి నీటి తడులు ఎక్కువ అవసరం. సాధారణంగా నవంబరు, డిసెంబరు నెలల్లో విస్తారంగా వర్షాలు పడుతుంటాయి. అయితే ముందస్తుగా వర్షాలు పడటంతో రబీ రైతులు వరిపై గురిపెట్టుకుని సాగుకు సిద్ధమవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా రబీ సీజన్‌లో 99710 హెక్టార్లు సాధారణ విస్తీర్ణం కాగా.. అందులో 84,017 హెక్టార్లల్లో వరి సాగు చేయడం విశేషం. శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజక వర్గాల పరిధిలో దాదాపు 35 వేల హెక్టార్లకు పైగా వరి సాగయ్యే అవకాశం ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు.

### గంగ పుణ్యం

తెలుగుగంగ పరివాహక ప్రాంతంలో ఇప్పటికే సాగుకు సన్నాహాలు వేగవంతమయ్యాయి. గంగ కాల్వల్లో వెళ్తున్న నీటితో నార్లు పోసుకున్న రైతులు ప్రస్తుతం నాట్లు నాటు కునేందుకు సమాయత్తం అవుతున్నారు. ఇక చెరువులు, బావులు ఆధారితంగా సాగు చేసే రైతులకు ఆనందమే మరి. వరుణుని కరుణతో కొండల సమీపంలోని చెరువుల్లో దాదాపు 50 శాతానికి, సాధారణ చెరువుల్లో 30 శాతానికి పైగా సాగునీరు చేరింది. దీంతో సాగు పనులతో బిజీ అయ్యారు.

### వర్షంతో ఎంతో ప్రయోజనం

సాధారణంగా నవంబరు నెలలో కురిసే వర్షాలు వాయుగుండం ప్రభావంతో ముందస్తుగా పడటం రైతులకు ఎంతో ప్రయోజనకరం. ప్రస్తుతం బావులు, బోర్లు, చెరువుల్లో చేరిన నీటి నిల్వలతో రైతులు సాగుకు సన్నాహాలు సిద్ధం చేసుకోవడంలో నిమగ్నమయ్యారు. ఈ దఫా వరి సాగు విస్తీర్ణం మరింతగా పెరిగే అవకాశముంది. తెలుగుగంగ కారణంగా అక్కడి పరివాహక ప్రాంత రైతులు ఇప్పటికే రబీ సాగు పనులు ప్రారంభించుకున్నారు. వాయుగుండం రూపంలో కురిసిన వర్షంతో రైతులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

- రమేష్‌రెడ్డి, వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు, శ్రీకాళహస్తి



లక్ష్మీపురం సమీపంలో నాట్లు వేస్తున్న కూలీలు

## మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
శ్రీకాళహస్తి: 80085 74555
నాగలాపురం: 98854 43308

న్యూస్‌టుడే, వరదయ్యపాళెం

**సమస్య:** స్థానిక పంచాయతీలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు సమీపంలో శ్రీకాళహస్తి-తడ రహదారికి పక్కన పంట కాలువ పూడి పోయింది. దీంతో వర్షపునీరు రహదారిలోకి చేరుతోంది. పక్కనే ఉన్న దుకాణాలు, ఇళ్లలోకి చేరుతోంది. - దొడ్డిశేఖర్, అక్కిసంపాళెం

**సమాధానం:** జలవనరులశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి కాలువ ఆధునీకరణకు చర్యలు తీసుకుంటాం.
- బసిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి

## మురుగు తొలగించేందుకు చర్యలు

శ్రీకాళహస్తి గ్రామీణం(ఏర్పేడు), న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో పేరుకు పోయిన మురుగునీటిని తొలగించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. రాచగున్నేరి, అముడూరు పంచాయతీల్లో మురుగునీరు పేరుకు పోవడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారని ఈనాడులో శుక్రవారం 'ఎన్నాళ్లిలా..?' శీర్షికతో కథనం ప్రచురితమైంది. స్పందించిన శ్రీకాళహస్తి ఎంపీడీవో పఠాన్ రఫీఖాన్ రాచగున్నేరి పంచాయతీ కార్యదర్శి గోవిందయ్యకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఏర్పేడు ఎంపీడీవో సౌభాగ్యం అముడూరు పంచాయతీలో మురుగు తొలగించాలని పంచాయతీ అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో పారిశుద్ధ్య కార్మికులు సమస్యను పరిష్కరించేందుకు శ్రీకారం చుట్టారు.

ఈనాడు కథనానికి స్పందన

## విశ్రాంతి ప్రాంగణంలో భద్రతా ఏర్పాట్లు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయం తరఫున భక్తుల సౌకర్యార్థం నిర్మించిన విశ్రాంతి ప్రాంగణం వద్ద భద్రతా ఏర్పాట్లు కల్పించారు. గతంలో ఇక్కడ మందుబాబులు రావడంతో సేద తీరేందుకు వచ్చే భక్తులు అవస్థలు పడుతూ వచ్చారు. ఈ విషయమై ఈ నెల 15వ తేదీన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఈవో చంద్రశేఖర్ ఆజాద్ సూచనల మేరకు కంచెను ఏర్పాటు చేశారు. ఈవో చర్యలపై భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



విద్యార్థికి జ్ఞాపిక అందిస్తున్న గుడ్లూరు ఐశ్వర్య

## కరాటేలో విద్యార్థుల సత్తా

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: అబ్దుల్ కలాం ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ఎంజీఎం విద్యార్థులు సత్తా చాటారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులను శుక్రవారం ఎంజీఎం గ్రూప్ డైరెక్టర్ ఐశ్వర్య ఘనంగా సత్కరించారు. అండర్-14 బాలుర విభాగంలో 8వ తరగతి విద్యార్థి తేజో మారుతి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ బహుమతిని, అండర్-12 బాలికల విభాగంలో ఆరో తరగతి విద్యార్థిని మీనాక్షి తృతీయ స్థానంలో బహుమతిని సాధించినట్లు ఆమె తెలిపారు.

## తుపాను బాధితులను ఆదుకోవాలి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: తుపానుతో నష్టపోయిన బాధితులను ఆదుకోవాలని సీపీఐ నేతలు డిమాండ్ చేశారు. ఈ విషయమై శుక్రవారం తహసీల్దార్ లక్ష్మీనారాయణకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండ్రోజులుగా కురిసిన వర్షాల కారణంగా పట్టణంలోని ఈశ్వరయ్యకాలనీ, చెంచులక్ష్మీకాలనీ, శ్రీకాళహస్తి మండలంలోని ముళ్లపూడి గిరిజన కాలనీ, వేడాం, చుక్కల నిడిగల్లు గిరిజన కాలనీల్లోని వాళ్లకు నిత్యావసర సరకులు అందజేయాలని కోరారు. ఈ మేరకు తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో శివకుమార్, మునిరాజ, శివ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న సీపీఐ నాయకులు

## విమర్శలకు చెల్లుచీటి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయానికి వెళ్లే ప్రవేశ మార్గాల్లో ఒక్కటైన తిరుమంజన గోపురం వద్ద చెక్కలతో ఏర్పాటు చేసిన మెట్లను అధికారులు తొలగించారు. ఇటీవల వర్షాలకు మెట్లకు పైన అమర్చిన చెక్కలు జారుతుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇక్కడున్న 27 మెట్లు 27 నక్షత్రాలకు ప్రతీకలుగా భక్తులు విశ్వసిస్తుంటారు. ఈ మెట్లను ఎక్కి స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు స్థానికులు పలువురు ఈ మార్గం గుండా వస్తుంటారు. అయితే వీటిపై చెక్కలు అమర్చడంపై గత వైకాపా ప్రభుత్వ హయాంలో విమర్శలు గుప్పుమన్నాయి. అప్పట్లో అధికారులు దీనిపై స్పందించలేదు. ప్రస్తుతం వర్షాల దృష్ట్యా చెక్కలు జారడం, భక్తులు దిగేందుకు ఇబ్బందులు పడటం, వీటి కింద వ్యర్థాలు భారీగా నిల్వ చేరడం తదితర కారణాలతో తొలగించడంతో భక్తులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.



## నూతన పార్కింగ్ నియమాలు

రేణిగుంట : రేణిగుంట పట్టణంలో నూతన ట్రాఫిక్ పద్ధతిని రేణిగుంట పట్టణ పోలీసులు అమలు చేశారు. బజార్‌వీధి, పోస్టాఫీస్ వీధిలో ఒక్కొక్క రోజు ఒకపక్క పార్కింగ్ చేయాలని, దీంతో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించవచ్చని పోలీసులు తెలిపారు. ఎవరైనా వ్యతిరేకిస్తే జరిమానాలు విధిస్తామని పట్టణ పోలీసులు హెచ్చరించారు.

## సఫాయికర్మచారి కమిషన్ ఛైర్మన్‌కు స్వాగతం

రేణిగుంట, న్యూస్‌టుడే: జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ ఛైర్మన్ వెంకటేశన్‌కు రేణిగుంట విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. మూడు రోజుల జిల్లా పర్యటన నిమిత్తం ఆయన శుక్రవారం ఇక్కడికి చేరుకున్నారు. ఈ సందర్భంగా విమానాశ్రయంలో ఆయనకు జిల్లా సాంఘిక సంక్షేమాధికారి చెన్నయ్య, ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి తదితరులు స్వాగతం పలికారు. అనంతరం తిరుపతి బయలుదేరి వెళ్లారు.



వెంకటేశన్‌కు స్వాగతం పలుకుతున్న చెన్నయ్య

# అభివృద్ధి పనులకు శ్రీకారం



ఏర్పేడు: రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న అధికారులు, నేతలు

ఏర్పేడు, న్యూస్‌టుడే: పల్లెపండుగ వారోత్సవాల్లో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. మండలంలోని పాతవీరాపురంలో శుక్రవారం రూ.10లక్షల వ్యయంతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో తెదేపా నేతలు ధనంజయులనాయుడు, నాగరాజునాయుడు, మధురెడ్డి, ధర్మారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **బీఎన్‌కండ్రిగ:** మండలంలోని పుత్తేరి, పీవీకండ్రిగ, ఆలత్తూరు, పల్లమాల, కాటూరు, పార్లపల్లి, కొత్తపాళెం, టీబీపురం, బీఎస్‌పురం గ్రామాల్లో శుక్రవారం పల్లె పండుగ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీసీ రహదారులు, గోకులం షెడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. పండ్ల తోటల పెంపకానికి లబ్ధిదారులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షులు ఎం.సుధాకర్‌నాయుడు, ఎంపీడీవో త్రివిక్రమరావు, తెదేపా నాయకులు కన్నయ్యనాయుడు, మధునాయుడు, రవినాయుడు, విజయ్, కార్తీక్‌నాయుడు, శ్రీనివాసులు, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు. **కేవీబీపురం :** పల్లెల్లో అభివృద్ధి చేసి చూపినప్పుడే పల్లెవాసులు అసలైన పండుగను జరుపుకుటారని తెదేపా నియోజకవర్గ సమన్వయకర్త శ్రీపతిబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని పీవీకండ్రిగ, భైరాజులకండ్రిగ, తిమ్మసముద్రం, కొత్తూరు, రాగిగుంట, పెరిందేశం, రంగయ్యగుంట, మఠం, రాయపేడు గ్రామాల్లో పల్లెపండుగ వారోత్సవాలను ఉపాధిహామీపథకం అధికారులు నిర్వహించారు. బీసీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మునస్వామియాదవ్, జిల్లా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గోపీనాథరెడ్డి, తెదేపా మండల అధ్యక్షులు రామాంజినాయుడు, ఎంపీడీవో రాధారాణి, ఏపీవో కుమారస్వామి, సర్పంచులు దొరబాబునాయుడు, బాలాజీ, తెదేపా నాయకులు వెంకట్రామయ్య, రవి, సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

**వరదయ్యపాళెం:** ఇన్నాళ్లు అభివృద్ధికి శాపంగా మారిన దరిద్రపాలన పోయి, పల్లెల ప్రగతికి కొత్త పండుగ వచ్చిందని మండల తెదేపా క్లస్టర్ ఇన్‌ఛార్జి పన్నెం నిర్మల్ అన్నారు. వరదయ్యపాళెం పంచాయతీ గోపాలరావుకాలనీలో శుక్రవారం పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా రూ.26లక్షలతో సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. మాజీ ఎంపీపీ భారతి, సర్పంచి జ్యోతి, ఉపసర్పంచి చంద్రబాబు, తెదేపా నాయకులు శివయ్య, మునిభూషణమ్మ, జనసేన పార్టీ నాయకులు, భాజపా నాయకులు పాల్గొన్నారు. **నారాయణవనం :** ప్రతి గ్రామం అభివృద్ధి పథంలో పయనించేలా కూటమి ప్రభుత్వం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిందని తెదేపా మండల అధ్యక్షులు బొమ్మినేని శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం పల్లె పండుగ కార్యక్రమాన్ని అరణ్యం కండ్రిగ పంచాయతీలో అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో సిమెంటు రహదారులు, మురుగునీటి కాలువల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఎంపీడీవో గుణశేఖర్, తెదేపా, జనసేన నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



వరదయ్యపాళెం: సీసీరోడ్డునకు భూమిపూజ చేస్తున్న తెదేపా నాయకులు



నారాయణవనం: భూమి పూజ చేస్తున్న తెదేపా నాయకులు

**నాగలాపురం:** నాగలాపురం పంచాయతీ పరిధిలో రూ.49.75 లక్షల అంచనా వ్యయంతో 13 మురుగు నీటి కాలువలు, సిమెంటు రహదారుల పనులకు తెదేపా మండలాధ్యక్షులు శ్రీనివాసులుయాదవ్ శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వెంకటరత్నమ్మ, ఈవో రమేష్‌చంద్ర, తెదేపా నేతలు ఆటోబాలాజీ, కుమారేసన్, శ్యామ్యూల్, పార్థీబన్, పరశురాంశిల్పి, కుమార్, మండేలా తదితరులు పాల్గొన్నారు. **సత్యవేడు :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని రాజగోపాలపురం పంచాయతీ అరుంధతివాడ, పీవీపురం గ్రామాల్లో సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంఈవో రవి, తెదేపా, జనసేన మండల పార్టీ అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్, రూపేష్, ఉపసర్పంచి దామురాజు పాల్గొన్నారు.

**విద్యుత్తు సరఫరాకు అంతరాయం రేపు.. శ్రీకాళహస్తి** : ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలో ఆదివారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఉంటుందని డిస్కం తిరుపతి గ్రామీణ ఈఈ వాసురెడ్డి తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతులు, విద్యుత్తు తీగల సమస్యలను పరిష్కరించడం, తదితర కారణాలతో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2 గంటలకు సరఫరాను నిలుపుదల చేస్తున్నట్లు వివరించారు. శ్రీకాళహస్తి పట్టణం, గ్రామీణం, తొట్టంబేడు, ఏర్పేడు, కేవీబీపురం, బీఎన్‌కండ్రిగ మండలాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకారం అందించాలని కోరారు. **నాగలాపురం:** నాగలాపురంలోని 133 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో శనివారం నిర్వహణ పనులు చేయనున్నట్లు ఏడీఏ రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో ఉపకేంద్రం పరిధిలోని నాగలాపురం, బీరకుప్పం, సుబ్బానాయుడుకండ్రిగ ఫీడర్లలోని గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన తెలిపారు.

**క్యాన్సర్‌పై అలక్ష్యం వద్దు.. శ్రీకాళహస్తి :** క్యాన్సర్ వ్యాధిని సకాలంలో గుర్తించాలని టాటా ట్రస్టు వైద్యులు వెంకయ్యబాబు అన్నారు. పట్టణంలోని బహుదూరుపేటలో రాస్ నేతృత్వంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. స్థానికులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. రాస్ పొదుపు సంఘాల సంచాలకులు నాగరాజు, రెడ్డికుమారి, మోహతాజ్, మహేంద్ర, రాస్ సిబ్బంది ముఖేష్, రాజేశ్వరి, జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

**పంచాయతీ ప్రగతిలో భాగస్వాములు కావాలి.. వరదయ్యపాళెం:** పంచాయతీల పాలనావ్యవహారాలు, ప్రగతి కార్యక్రమాల్లో సర్పంచితో పాటు ఉపసర్పంచి, వార్డు సభ్యులు భాగస్వాములు కావాలని ఎంపీడీవో ప్రసాద్ కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం మండలంలోని ఉపసర్పంచులు, వార్డుసభ్యులకు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈవోపీఆర్డీ చిరంజీవి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

**అభివృద్ధికి తోడ్పండి .. సత్యవేడు:** పంచాయతీల అభివృద్ధికి వార్డు సభ్యులు కీలకమని ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉప సర్పంచులకు, వార్డు సభ్యులకు శిక్షణ ఇచ్చారు. సమస్యలను పంచాయతీ సమావేశంలో ప్రస్తావించాల్సిన బాధ్యత వార్డు సభ్యులపై ఉందన్నారు. జడ్పీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి, పంచాయతీ రాజ్ విస్తరణ అధికారి తరుణాక్షరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## పేరుకే మిట్ట.. తప్పని తంటా

పట్టణంలోని మిట్టకండ్రిగ ప్రాథమిక పాఠశాల దుస్థితి ఇది. వర్షం పడితే ఇక్కడి పాఠశాల ఆవరణలో భారీగా వర్షపు నీరు నిలుస్తోంది. నిల్వ నీళ్లు బయటకు వెళ్లేందుకు వీల్లేని పరిస్థితి. అంతేకాకుండా రోడ్డు కంటే మరింత తక్కువలో పాఠశాల ఉండటంతో వర్షం పడితే ఈ తరహా తంటాలతో విద్యార్థులు అవస్థలు పడాల్సి వస్తోంది. - న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి



## అదుపు తప్పితే... బురదలో పడతారు

రేణిగుంట : రేణిగుంట తహసీల్దార్ కార్యాలయం, బీసీ వసతి గృహం, పశువైద్య ఆస్పత్రికి వెళ్లే మార్గం మొత్తం తారు రోడ్డే. అది ఒకప్పుడు... ఇప్పుడు ఆ రోడ్డు మొత్తం అత్యంత దారుణంగా మారింది. చిన్నపాటి మరమ్మతు చేయకుండా వదిలేయడంతో ఆ రోడ్డు కాస్త దుస్థితికి చేరుకుంది. పైగా పారిశ్రామికవాడకు వెళ్లే భారీ వాహనాలు సైతం ఈ మార్గాన్నే ఉపయోగిస్తుంటాయి. ప్రస్తుతం ఈ మార్గం గుంతలమయమై ప్రమాదకరంగా మారింది. కనీసం ఇక్కడ చిన్నపాటి మరమ్మతు చేసినా ప్రజల ఇబ్బందులు తొలగనున్నాయి. ఈ అంశంపై సర్పంచి నాగేశం మాట్లాడుతూ ఇక్కడ రోడ్డు పరిశీలించి అందుకుతగ్గ పనులు చేయిస్తామని తెలిపారు.

## భూ ఆక్రమణపై చర్యలు తీసుకోండి

వరదయ్యపాళెం : తమ పంచాయతీలో అధికారం అండతో ఓ రాజకీయ నేత ప్రభుత్వ భూముల్లో చేపట్టిన ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని అంబూరు సర్పంచి సాయిరెడ్డి శుక్రవారం తహసీల్దారు రాజశేఖర్‌కు వినతి పత్రాన్ని అందించారు. అంబూరు రెవెన్యూ పరిధిలో సర్వేనెం.274లో 25 ఎకరాల ప్రభుత్వ భూములున్నాయన్నారు. అందులో పది ఎకరాల భూమిని పక్క పంచాయతీలోని ఓ అధికారపార్టీకి చెందిన నాయకుడు తన పట్టాభూములకు పక్కనే ఉందనే కారణంతో ఆక్రమించారని ఆరోపించారు. రెవెన్యూ అధికారులచే విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని తహసీల్దారు హామీ ఇచ్చారు.




శ్రీకాళహస్తి: అదనపు ఛార్జీలు రద్దు చేయాలని సీపీఎం నేతలు



రేణిగుంటలో..

## ట్రూఅప్ ఛార్జీలు నియంత్రించండి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: విద్యుత్తు శాఖ ట్రూఅప్ ఛార్జీల పేరుతో ప్రజలపై మోయలేని భారాన్ని మోపుతోందని సీపీఎం డివిజన్ కార్యదర్శి పుల్లయ్య ధ్వజమెత్తారు. పట్టణంలోని డిస్కం కార్యాలయం వద్ద శుక్రవారం విద్యుత్తు శాఖ తీరుకు నిరసనగా ధర్నా చేశారు. తక్షణం ఈ జీవోను రద్దు చేయాలని కోరారు. ఈ మేరకు అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. మణి, షరీఫ్, కుమార్, వేణు, వెలివేంద్రం, వెంకటేష్, అన్వర్‌బాషా, రాజా తదితరులు పాల్గొన్నారు. **రేణిగుంట :** రాష్ట్రంలో విద్యుత్ సర్దుబాటు ఛార్జీలు, ట్రూ అఫ్ ఛార్జీలను వెంటనే రద్దు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఇందుకు నిరసనగా శుక్రవారం స్థానిక పట్టణ ఏఈ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తయిందని, ఎన్నికల హామీలను నెరవేర్చకపోగా పేద మధ్య తరగతి ప్రజలు వినియోగించే విద్యుత్ బిల్లులపై అధిక దోపిడీ చేయాలని చూస్తుందన్నారు. ఈ బాధని విద్యుత్ సర్దుబాటు ఛార్జీల పేరుతో రూ.8 వేల కోట్లు ప్రజల నుంచి దోచుకునేందుకు సిద్ధపడిందన్నారు. సీపీఎం నాయకులు వెంకటరమణ, హరినాథ్, సత్యశ్రీ, ఈశ్వరమ్మ, దిలీప్‌బాషా తదితరులు పాల్గొన్నారు. **నాగలాపురం :** విద్యుత్ ఛార్జీల పెంపు నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సీపీఎం మండల మహిళా కార్యదర్శి అముద డిమాండ్ చేశారు. నాగలాపురం విద్యుత్ ఉపకేంద్రం ఎదుట పార్టీ మహిళా నేతలతో కలిసి ఆమె శుక్రవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో నేతలు అమృత, గౌసియా తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి

కేవీబీపురం : మండలంలో ఎప్పటి నుంచో పేరుకుపోయిన రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చూడాలని డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తూ తహసీల్దార్‌గా పూర్తి బాధ్యతలను స్వీకరించిన మునిరత్నంకు తెదేపా నాయకులు విన్నవించారు. శుక్రవారం తహసీల్దార్‌గా పూర్తిబాధ్యతలను స్వీకరించిన మునిరత్నంను తెలుగు తమ్ముళ్లు దుస్సాలువాతో సన్మానించారు. తెదేపా బీసీసెల్ రాష్ట్రప్రధాన కార్యదర్శి మునస్వామియాదవ్, సర్పంచి దొరబాబునాయుడు, వెంకటకృష్ణయ్య, బత్తెయ్యయాదవ్, చందు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పట్టణంలోని రెవెన్యూ కాలనీలో ఇంట్లో విద్యుత్తు మరమ్మతులు చేపడుతున్న ఎలక్ట్రీషియన్ మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే తమిళనాడు తిరువళ్లూరుకు చెందిన ముగ్గురు కార్మికులు ఇక్కడి రెవెన్యూ కాలనీలో విద్యుత్తు పనులు చేపట్టేందుకు వచ్చారు. స్విచ్ బోర్డులు ఏర్పాటు చేస్తున్న క్రమంలో శుక్రవారం విద్యుదాఘాతానికి గురై దిలీప్ (30) మృతి చెందినట్లు పోలీసులకు సమాచారం అందింది. మృతుడి కుటుంబీకులకు సమాచారం చేరవేశారు.

## ప్రమాదంలో గాయపడ్డ ..

నాగలాపురం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. నాగలాపురం మండలంలోని చిన్నాపట్టుకు చెందిన మార్కండేయులు(42) గత నెల 24వ తేదీన ఎద్దుల బండిపై స్వగ్రామం నుంచి కారణికి వ్యవసాయ పనుల నిమిత్తం వెళుతుండగా వెనుక నుంచి లారీ ఢీ కొంది. ఈ సంఘటనలో తీవ్రగాయాలైన మార్కండేయులు చెన్నైలోని ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ శుక్రవారం మరణించినట్లు ఎస్‌హెచ్‌వో హనీఫ్ మొహమ్మద్ తెలిపారు.

# గూడూరు

•గూడూరు • వెంకటగిరి • సూళ్లూరుపేట



**గూడూరులో నిమ్మ ధరలు**

మొదటి రకం: కేజీ రూ. 60 నుంచి రూ. 80 వరకు

రెండో రకం: కిలో రూ. 50 నుంచి రూ. 60 వరకు

**కోళ్ల ధరలు**

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

| | |
|---|---|
| బ్రాయిలర్ | 140 |
| లేయర్ | 115 |
| బ్రాయిలర్ | 250 |
| బ్రాయిలర్ స్కిన్‌లెస్ | 276 |
| లేయర్ మాంసం | 195 |

### 22 నుంచి ఉచిత ఆధార్ క్యాంపు

**గూడూరు పట్టణం, న్యూస్‌టుడే:** గూడూరు పురపాలక ఆధ్వర్యంలో ఈ నెల 22 నుంచి 25 వరకు ఉచిత ఆధార్ కార్డుల సవరణ, నూతన కార్డుల మంజూరు చేయడం జరుగుతుందని కమిషనర్ వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

### మందుల పంపిణీ

**గూడూరు పట్టణం, న్యూస్‌టుడే:** మండలంలోని కొండాగుంట, తిప్పవరపాడు, పురపాలక పరిధిలోని చెన్నూరు పశు వైద్యశాల వైద్యుల ఆధ్వర్యంలో గొర్రెలకి, మేకలకి నట్టల నివారణ మందులు పంపిణీ చేసినట్లు గూడూరు ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకుడు డాక్టర్ సురేష్ శుక్రవారం తెలిపారు.

**మేమున్నాం.. మీకు తోడుగా..**

గూడూరు : 85002 02046 · నాయుడుపేట: 80085 73970 · సూళ్లూరుపేట: 96188 78782 · వెంకటగిరి : 80085 73966 · సమయం 10 AM TO 1 PM

**న్యూస్‌టుడే, సూళ్లూరుపేట**

**సమస్య:** సూళ్లూరుపేట పురపాలికలోని సోనియాగాంధీ నగర్‌లో పెట్రోల్ బంకు వెనుక వీధిలో స్తంభానికి దీపం వెలగడం లేదు. **- మోహనరావు, స్థానికుడు**

**సమాధానం:** సచివాలయ సిబ్బందిని పంపి వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. **- కె.చిన్నయ్య, పుర కమిషనర్**

**న్యూస్‌టుడే, కోట**

**సమస్య:** కోట మండల కాంప్లెక్స్‌లోని సబ్ ట్రెజరీ కార్యాలయ భవనం నిరుపయోగంగా మారింది. భవనం చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. **- నాగూరు, స్థానికుడు**

**సమాధానం:** పరిశీలించి ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు నివారణ చర్యలు తీసుకుంటాం. **- కిరణ్, ఇన్‌ఛార్జి ఏఈ**

**బాలాయపల్లి, న్యూస్‌టుడే :**

**సమస్య:** బాలాయపల్లి-మన్నూరు మిట్ట కు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా కంప చెట్లు పెరిగిపోవడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. **- ప్రభాకర్, మన్నూరు మిట్ట**

**సమాధానం:** సమస్య మా దృష్టికి వచ్చింది. వెంటనే కంప చెట్లను తొలగిస్తాం. **- మోహన్ రాజు, ఈవోపీఆర్డీ, బాలాయపల్లి**

### కొమ్మల తొలగింపు

**సూళ్లూరుపేట :** పట్టణంలోని బాలికల గురుకుల పాఠశాల సమీపాన వాకాటి నారాయణరెడ్డి నగర్‌లో విద్యుత్తు తీగలకు చెట్ల కొమ్మలు తగులుతుండేవి. దీనిపై 'ఈనాడు'లో 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన వార్త ప్రచురితం కావడంతో ఉప్పల దీతాకు శేఖర్ స్పందించి సిబ్బంది చేత చెట్ల కొమ్మలు తొలగించారు.

### కాలువలు శుభ్రం

**గూడూరు పట్టణం, న్యూస్‌టుడే:** పట్టణంలోని మాళ్వానగర్ ప్రాంతంలో కాలువలలో సక్రమంగా మురుగు వెళ్లకపోవడంతో 'ఈనాడు'లో 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికన వార్త ప్రచురితమైంది. స్పందించిన కమిషనర్ వెంకటేశ్వర్లు సిబ్బంది ద్వారా డ్రైనేజీ కాలువను శుభ్రం చేసేలా చర్యలు తీసుకున్నారు.

స్పందనకు వందనం

## రెవెన్యూ మంత్రితో ఎమ్మెల్యే భేటీ



మంత్రి సత్యప్రసాద్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

**వెంకటగిరి, న్యూస్‌టుడే:** రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అమరావతిలోని మంత్రి ఛాంబర్‌లో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. నియోజకవర్గంలో రెవెన్యూ భూముల ఆక్రమణలు తదితర వాటిపై చర్చించారు. వెంకటగిరి-నాయుడుపేట మార్గం, ఏర్పేడు మార్గంలో పరిశ్రమల స్థాపనకు అవసరమైన ప్రభుత్వ భూములు ఉన్నాయని పరిశీలించి సెజ్ ఏర్పాటుకు సహకరించాలని కోరారు.



ప్రచార పత్రాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం

## 22న ఉద్యోగ మేళా

**నాయుడుపేట, సూళ్లూరుపేట:** ఈ నెల 22న సూళ్లూరుపేట శ్రీసత్యసాయి కల్యాణ మండపంలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఆధ్వర్యంలో ఏపీ నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ కల్పనాశాఖ కలిసి మెగా ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం తెలిపారు. శుక్రవారం నాయుడుపేట అగ్రహారపేటలో ఇందుకు సంబంధించిన పోస్టర్లను నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులతో కలిసి విడుదల చేశారు. మాజీ ఎంపీ కృష్ణయ్య, నాయకులు కుబేరుమణి, పసల గంగాప్రసాద్, నాగేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్లను కాదని జూనియర్లకు ఎఫ్ఏసీ

**జలవనరుల శాఖలో వింత పరిస్థితి**

**గూడూరు, న్యూస్‌టుడే:** జలవనరుల శాఖలో సీనియర్లను కాదని జూనియర్లకు ఫుల్ అడిషనల్ ఛార్జ్(ఎఫ్ఏసీ)ల పేరిట డీఈలుగా కేటాయించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గూడూరు ఇరిగేషన్ సబ్ డివిజన్‌లో ఇలాంటి వివాదం నెలకొంది. నాయుడుపేట ఇరిగేషన్ సబ్ డివిజన్‌లో పనిచేస్తున్న కోటేశ్వరరావుని రాపూరుకి ఇటీవల బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఇక్కడే ఏఈగా పనిచేసిన వీరాస్వామిని నియమించారు. గత నెలలో ఓజిలి సెక్షన్‌కి బదిలీ కాగా.. ఇదే వ్యక్తిని తిరిగి నాయుడుపేట సెక్షన్ డీఈగా (ఎఫ్ఏసీ) వేయడం చర్చగా మారింది. సదరు ఇంజినీర్ జూనియర్ కాగా సబ్ డివిజన్ డీఈగానూ వేయడంపై ఆరోపణలు వస్తున్నాయి. ఇరిగేషన్ సబ్ డివిజన్‌లో చాలా మంది సీనియర్లను పక్కన పెట్టి ఏకంగా ఆదనపు బాధ్యతలు ఇవ్వడం ఏమిటన్న ప్రశ్న సదరు శాఖ ఉద్యోగుల నుంచి వస్తోంది. ఇదే తీరుగా నెల్లూరు ఇరిగేషన్ సర్కిల్‌లో మరో ఏఈని డీఈగా ఆదనపు బాధ్యతల పేరుతో వేయడంపైనా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



అధికారులతో సమీక్షిస్తున్న సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా

## లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు

**గూడూరు పట్టణం :** లింగ నిర్ధారణ చట్టాన్ని పట్టిష్ఠంగా అమలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా తెలిపారు. గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో శుక్రవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. సమాజంలో స్త్రీ, పురుషుల ఇద్దరూ సమానమేనని, ఆడపిల్లల పట్ల వివక్షత ఉండకూడదన్నారు. స్కానింగ్ సెంటర్లను వైద్యులు తనిఖీ చేసి, లింగ నిర్ధారణ పరీక్షలు చేసే కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పద్మావతి, ఐసీడీఎస్ అధికారులు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కోట ఆస్పత్రి స్థాయి పెంచాలి



మంత్రి సత్యకుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కొమ్మూరి కోటేశ్వరరావు

**కోట :** కోటలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని 50 పడకల స్థాయికి పెంచాలని కోరుతూ భాజపా రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు కొమ్మూరి కోటేశ్వరరావు అమరావతిలో శుక్రవారం వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కోట ఆస్పత్రికి నిత్యం 300 మందికి పైగా రోగులు వస్తున్నారని.. ప్రస్తుతం 30 పడకలు ఉన్నాయని దీనిని దృష్టిలో ఉంచుకుని ఆస్పత్రి స్థాయి పెంచాలని వివరించారు. మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు.

## ఆక్రమణల జోరు..

**➤ రూ.60 కోట్లు వెచ్చించినా ఫలితం శూన్యం**

**➤ వాహనదారులకు తప్పని ఇక్కట్లు**

# పట్టించుకునేదెవరు..?



కోట-వాకాడు మార్గంలో ఆక్రమణలు

**గూడూరు (గ్రామీణ), న్యూస్‌టుడే:** కోట రోడ్లు భవనాల శాఖ సబ్ డివిజన్ పరిధిలోని వాకాడు, కోట, చిట్టమూరు మండలాల్లో ర.భ స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయి. సబ్ డివిజన్ పరిధిలో వైకాపా పాలన నుంచి ర.భ అధికారులు ఉన్నా లేనట్లుగా వ్యవహరిస్తున్నారు. కొంత కాలంగా ఈ ఆక్రమణల పర్వం కొనసాగుతున్నా.. ఆపేవారు లేకపోగా మూడు మండలాల్లో ఒకరిని చూసి మరొకరు ర.భ రోడ్లు అంచున ఉన్న స్థలాలను ఆక్రమించేస్తున్నారు. ప్రధానంగా గూడూరు-దుగరాజపట్నం, నాయుడుపేట-దుగరాజపట్నం ర.భ రోడ్ల మార్గంలో రోజురోజుకు ఆక్రమణలు ఊపందుకుంటున్నాయి. వైకాపా పాలన నుంచి ఆక్రమణలు కొనసాగుతున్నా.. అప్పట్లో అధికారులు వైకాపా నేతల ఒత్తిళ్లకు తలొగ్గి చూసీచూడనట్లుగా వ్యవహరించారు.

గూడూరు-దుగరాజపట్నం, నాయుడుపేట-దుగరాజపట్నం మార్గంలో 2014 తెదేపా పాలనలో సుమారు రూ.60 కోట్ల వ్యయంతో విడతల వారీగా రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. ఆ సమయంలో అక్కడ ఉన్న ఆక్రమణలను తొలగించి రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేశారు. అయితే 2019లో వైకాపా ప్రభుత్వ హయాంలో రోడ్డు అంచునే ఆక్రమణలు ఒక్కొక్కటిగా వెలిశాయి.

**రూ.15 కోట్లతో రెండో విడత పనులు**

విద్యానగర్ నుంచి వాకాడు మండలం కోడివాక వరకు రూ.15 కోట్లతో రెండో విడత రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. ఆక్రమణలు తొలగించకనే పనులు పూర్తి చేశారు. ఇక్కడ 10 మీటర్ల వెడల్పుతో రోడ్డు విస్తరణ చేయాల్సి ఉన్నా.. 7 మీటర్లతో రోడ్డు వేయడం గమనార్హం. ఫలితంగా వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. కోట మండలంలోని విద్యానగర్, కోట ఆర్డబ్ల్యూ, తిన్నెలపూడి బీడు, వీరారెడ్డిసత్రం, వెంకన్నపాలెం, రంగన్నగుంట, వాకాడులోని ఆశోక స్తంభం, రెవెన్యూ కార్యాలయం వద్ద, సిద్ధిగుంటపాలెం, కల్లూరు కొత్తపాలెం, వడ్డిపాలెం ప్రాంతాల్లో ర.భ రోడ్డు అంచునే ఆక్రమణలు కోకొల్లలుగా ఉన్నాయి. సిద్ధిగుంటపాలెంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించాలని కొందరు అధికారులు చుట్టూ తిరుగుతున్నారు. 15 రోజుల కిందట ఆక్రమణలు తొలగించాలని నోటీసులు ఇచ్చినా నేటికీ తొలగింపు చర్యలు చేపట్టలేదు.



విద్యానగర్ వద్ద ఆక్రమణలు తొలగించకుండానే విభాగిని ఏర్పాటు

**ఇవిగో ఆక్రమణలు..**

గూడూరు-దుగరాజపట్నం రోడ్డు మార్గంలో 2014లో మొదటి విడతలో రూ.17 కోట్ల వ్యయంతో రోడ్డు విస్తరణ పనులు చేశారు. ఆ సమయంలో 10 మీటర్ల వెడల్పుతో రోడ్డు వేశారు. చిల్లకూరు మండలం కడివేడు ప్రాంతంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించారు. వైకాపా పాలనలో మరలా ఆక్రమణలు వెలిశాయి. కోట మండలం కొండుగుంట, కేశవరం, చిట్టేడు, ఊనుగుంటపాలెం రోడ్డు, చంద్రశేఖరపురం ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. కోట మండలం విద్యానగర్‌లో 2014 పూర్వం నుంచి ఆక్రమణలు ఉన్నా తొలగించలేదు. కారణం ప్రధాన పార్టీల నేతల సిఫార్సులతో విస్తరణ పనులు విద్యానగర్‌లో నిలిచాయి.

**చర్యలు తీసుకుంటాం**

ఆక్రమణలపై త్వరలో చర్యలు తీసుకుంటాం. క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆక్రమణదారులకు నోటీసులు ఇస్తాం.

**- రామాంజనేయులు ర.భ ఈఈ, గూడూరు**



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో వేణు

## సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

**కోట :** కోట మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ అంజమ్మ అధ్యక్షతన నిర్వహించారు. రెండు పర్యాయాలుగా సభ్యుల కోరం లేక వాయిదా పడుతూ వచ్చింది. ఈ క్రమంలో మూడో పర్యాయమైన మండల సమస్యలపై సభ్యులు గళం విప్పుతారని ఎదురుచూసినా సమావేశం సాదాసీదాగా జరగడంతో నిరాశయే ఎదురైంది. అధ్వానంగా ఉన్న రోడ్లు, తాగు నీటి సమస్యలు ప్రజలు పడుతున్న ఇబ్బందులపై సభలో ఎవరూ ప్రశ్నించలేదు. కొత్తపట్నం ఉప సర్పంచి ప్రసాద్‌గౌడ్ మాట్లాడుతూ.. కొత్తపట్నం పంచాయతీలో ప్రభుత్వ పథకాలు లబ్ధిదారుల ఎంపికలో స్థానిక ప్రజా ప్రతినిధులకు చెప్పకుండానే ఎంపిక చేస్తున్నారన్నారు. ఎంపీడీవో వేణు మాట్లాడుతూ.. అధికారులు, సచివాలయ సిబ్బంది పారదర్శకంగా పనిచేయాలని సూచించారు. తహసీల్దారు జయజయరావు మాట్లాడుతూ త్వరలోనే 19 రెవెన్యూ గ్రామాల్లో భూముల రీసర్వే జరుగుతుందన్నారు. ఎంపీడీవో వేణు, జడ్పీటీసీ సభ్యుడు కోటయ్య, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



తడ: కాదలూరులో సిమెంటు రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీడీవో, తెదేపా నాయకులు

## అభివృద్ధి పనులకు శ్రీకారం

**తడ, న్యూస్‌టుడే:** మండలంలోని కాదలూరు పంచాయతీ కట్టువ గ్రామంలో 'పల్లె పండుగ'లో భాగంగా సిమెంటు రోడ్డు ఏర్పాటుకు ఎంపీడీవో విజయకుమార్, తెదేపా నాయకుడు చంద్రయ్య భూమిపూజ చేశారు. **చిల్లకూరు:** మండలంలోని అన్ని గ్రామాల్లో 'పల్లె పండుగ'లో భాగంగా తెదేపా నాయకులు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. శుక్రవారం ఉడతావారిపాలెం పంచాయతీ పరిధిలోని రామారెడ్డిపాలెం, వడ్లకండ్రిగ గ్రామాల్లో తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు సన్నారెడ్డి వెంకటరామరెడ్డి ఆధ్వర్యంలో సిమెంటు రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు.

## 'ప్రజలపై భారం తగించాలి'

**వెంకటగిరి, న్యూస్‌టుడే:** ప్రజలపై విద్యుత్తు ఛార్జీల పెంపును తక్షణమే తగ్గించాలని సీపీఎం నియోజకవర్గ ఇన్‌ఛార్జి చెంగయ్య డిమాండ్ చేశారు. డిస్కం కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా చేశారు. ట్రూ అప్ ఛార్జీల పేరుతో ప్రజల మీద రూ.కోట్ల భారం మోపడం దారుణమన్నారు. కార్యక్రమంలో నాయకులు రమణయ్య, నాగరాజు, రాజయ్య, ధనుంజయ, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు. **గూడూరు పట్టణం :** ట్రూఅప్ ఛార్జీలను ప్రభుత్వం వెంటనే తగ్గించాలని సీపీఎం నాయకుడు జోగి శివకుమార్ తెలిపారు. గూడూరు పట్టణంలోని డిస్కం ఏఈ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. **నాయుడుపేట పట్టణం :** నాయుడుపేట విద్యుత్తు డీఈ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు, కార్మికులు శుక్రవారం నిరసన తెలిపారు. పెంచిన విద్యుత్తు ఛార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండు చేశారు. సీపీఎం మండల కార్యదర్శి మహేష్‌బాబు, నాయకులు ముకుంద, వీరాస్వామి, మోహన్, ప్రతాప్‌కుమార్ పాల్గొన్నారు.



వెంకటగిరి: డిస్కం కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నేతలు



← గూడూరు పట్టణంలో..

**అంతరాలయంలో వీడియో, ఫొటోలు నిషేధం**

**సూళ్లూరుపేట :** పట్టణంలోని చెంగాళమ్మ ఆలయ అంతరాలయంలో అమ్మవారి ఫొటోలు, వీడియోల చిత్రీకరణ నిషేధమని, దీనిపై కఠినంగా వ్యవహరిస్తామని దేవాదాయ శాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ ఎస్.ఎస్. చంద్రశేఖర్ ఆజాద్ పేర్కొన్నారు. శుక్రవారం చెంగాళమ్మ ఆలయంలో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు.

**నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం.. సూళ్లూరుపేట, న్యూస్‌టుడే:** సూళ్లూరుపేట గ్రామీణం, పట్టణం, తడ, దొరవారిసత్రం మండలాల్లోని 33కేవీ విద్యుత్తు ఉపకేంద్రాల్లో శనివారం మరమ్మతులు చేస్తున్న దృష్ట్యా సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో డీఈఈ శేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్తు ఉండదని ఆయన పేర్కొన్నారు.

**500 మందికి అన్నదానం.. కోట, న్యూస్‌టుడే:** స్థానిక కోటమ్మ దేవత ఆలయంలో శుక్రవారం పలు గ్రామాల భక్తులు సామూహికంగా పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్ మోహన్‌రెడ్డి, కవితమ్మ దంపతుల ఆధ్వర్యంలో దాతలు 500 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో అక్షయ సేవా సమితి ప్రతినిధులు అల్లం రమణయ్య, ఆవుల సుబ్బయ్య, పన్నగసాయి తదితరులు పాల్గొన్నారు.

**బాధితులకు ఆర్థికసాయం.. చిల్లకూరు, న్యూస్‌టుడే:** కడివేడు గ్రామానికి చెందిన రుద్రకోటి శివ,

## అవీ.. ఇవీ.. అన్నీ..

శివరాణి ఇంటిలో గురువారం అర్ధరాత్రి విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం జరిగింది. ఇంటిలోని వస్తుసామగ్రి పూర్తిగా కాలిపోయింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, పెంచలకోన ఆలయ మాజీ ఛైర్మన్ తానంకి నానాజీ సహకారంతో స్థానిక తెదేపా నాయకులు రూ.15 వేలు ఆర్థికసాయాన్ని బాధితులకు శుక్రవారం అందజేశారు.

**చెంచమ్మకు ప్రత్యేక పూజలు**

**వెంకటగిరి :** కొలిశెట్టిలోని చెంచమ్మ ఆలయంలో అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో చెంచమ్మ తల్లికి ప్రత్యేకాలంకరణ చేశారు. నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. వెంకటగిరి కాకుండా పరిసర ప్రాంతాల భక్తులు తరలివచ్చారు.

**శ్మశాన వాటికలో శుభ్రత పనులు.. సూళ్లూరుపేట, న్యూస్‌టుడే:** పట్టణంలోని హిందూ శ్మశాన వాటికలో పురపాలక కమిషనర్ కె.చిన్నయ్య శుభ్రత చర్యలు చేపట్టారు. శ్మశానవాటికలో పిచ్చిచెట్లు ఏపుగా పెరగడం, నీటి వసతి లేకపోవడంతో తరతర సమస్యలను స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి శుక్రవారం పొక్లెయిన్ ఏర్పాటు చేసి పిచ్చిమొక్కలు తొలగించారు. నీటి వసతికి చర్యలు చేపట్టారు.

**డీకేటీ పట్టాలకు పరిహారం ఇవ్వాలి.. కోట, న్యూస్‌టుడే:** కొత్తపట్నం పంచాయతీ పరిధిలోని గున్నంపడియలో ఏపీ జెన్‌కో తీసుకున్న డీకేటీ పట్టా లబ్ధిదారులకు పరిహారం అందజేయాలని తహసీల్దారు జయజయరావుకు లబ్ధిదారులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు.

**ఒప్పంద అధ్యాపకులను క్రమబద్ధీకరించాలి.. నాయుడుపేట, న్యూస్‌టుడే:** గత ప్రభుత్వంలో విడుదల చేసిన 114 జీవోను అమలు చేయాలని నాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఒప్పంద అధ్యాపకులు డిమాండ్ చేశారు. శుక్రవారం భోజన విరామ సమయంలో కళాశాల వద్ద పసుపు రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు.

**భర్త రెండో పెళ్లి చేసుకున్నాడని ఫిర్యాదు.. చిల్లకూరు, న్యూస్‌టుడే:** తనకు తెలియకుండా భర్త రెండో పెళ్లి చేసుకున్నాడని బాధితురాలు శుక్రవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉడతావారిపాలెం గ్రామానికి చెందిన సంధ్య అయిదేళ్ల కిందట మన్నూరుపోలూరుకు చెందిన ధనుంజయను ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి ఒక కుమారుడు ఉన్నాడు. భర్త వేధింపులు తట్టుకోలేక సంధ్య పుట్టింటికి వెళ్లారు. ఇదే అదనుగా భావించిన ధనుంజయ మరో అమ్మాయిని వివాహం చేసుకున్నాడని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు.

## సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాల అందజేత

**వాకాడు, న్యూస్‌టుడే:** వాకాడు ఎంపీడీవో అన్నపూర్ణరాజుకు తెదేపా నాయకుడు హర్షవర్ధన్ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలను శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.



ర్యాలీగా వస్తున్న విద్యార్థులు

## భవిత కేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ

**సూళ్లూరుపేట, న్యూస్‌టుడే:** పట్టణంలోని భవిత కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి నిర్లిప్త అభ్యాస వైకల్యాలపై శుక్రవారం అవగాహన ర్యాలీ చేపట్టారు. వైకల్యం కలిగిన విద్యార్థులకు సరైన మద్దతు లభిస్తే వారు విద్యతోపాటు వృత్తిపరంగా విజయవంతం అవుతారని భవిత కేంద్రం ఉపాధ్యాయిని భార్గవి తెలిపారు.



ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు

## ఎన్‌సీసీతో ఉద్యోగావకాశాలు

**వెంకటగిరి, న్యూస్‌టుడే:** ఎన్‌సీసీలో చేరిన విద్యార్థులకు ఉద్యోగావకాశాలు ఉంటాయని విశ్వోదయ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయశేఖరం అన్నారు. శుక్రవారం కళాశాలలో తిరుపతికి చెందిన 29వ బెటాలియన్ అధికారులు ఎన్‌సీసీ అభ్యర్థుల ఎంపిక కార్యక్రమం చేపట్టారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. ఎంపికైన వారికి మూడేళ్ల పాటు శిక్షణ ఇస్తారన్నారు. 22 మంది విద్యార్థులు ఎంపికయ్యారని చెప్పారు. కార్యక్రమంలో బెటాలియన్ సుబేదార్ విమల్ మింజ్, హవల్దార్ శివరాజ్ పాల్గొన్నారు.

## ప్రమాద ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు

**పెళ్లకూరు, న్యూస్‌టుడే:** జాతీయ రహదారి 71పై ప్రమాద ప్రాంతాలుగా ఉన్న చోట్ల హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఎస్సై నాగరాజు గుత్త సంస్థ ప్రతినిధులను ఆదేశించారు. రేణిగుంట-నాయుడుపేట మార్గంలో రహదారి విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో అక్కడక్కడ డైవర్షన్లు ఉన్నాయి. ఆయా చోట్ల హెచ్చరికలు లేక ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటిని గుర్తించిన ఎస్సై సంస్థ ప్రతినిధులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని సూచించారు.





కోట: రహదారిపై ఏర్పడ్డ గుంతలు

# గుంతల మధ్య దారేది..!

● ఏళ్లుగా ప్రతిపాదనలకే పరిమితం ● నిత్యం ప్రమాదాలు.. చోద్యం చూస్తున్న అధికారులు

**కోట, న్యూస్‌టుడే:** కోట ర.భ సబ్ డివిజన్ పరిధిలోని కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో 340 కి.మీ. వరకు ర.భ రోడ్లు విస్తరించి ఉన్నాయి. పలు గ్రామాల మీదుగా వెళ్లే రోడ్లకు ఐదేళ్లలో కనీస మరమ్మతులు కరవయ్యాయి. దీంతో ఈ మార్గంలో వాహనదారుల రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధ్వాన రోడ్లలో ప్రమాణం చేయడం వల్ల వాహనాలు దెబ్బతిని మరమ్మతులకు గురవుతున్నాయని వాహన చోదకులు వాపోతున్నారు. ప్రజలు అవస్థలు పడుతున్నా అధికారులు మాత్రం ప్రతిపాదనల పేరుతో కాలక్షేపం చేశారు.

**కోట మండలంలో..**

కోట మండలంలోని 21 పంచాయతీల పరిధిలో 140 కి.మీ. ర.భ రోడ్లు విస్తరించి ఉన్నాయి. అందులో కోట ఆర్డబ్ల్యూ నుంచి కొత్తచెరువు వరకు ఉన్న రహదారి అధ్వానంగా మారింది. నిత్యం ఈ మార్గంలో వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కోట-తిమ్మనాయుడుపాలెం రోడ్డు, కొత్తపాలెం-వీపీ అగ్రహారం, విద్యానగర్-గూడలి రోడ్లతో పాటు పలు రోడ్లు ధ్వంసం అయ్యాయి.

**చిట్టమూరులో..**

చిట్టమూరు మండలంలోని 23 పంచాయతీల్లో 100 కి.మీ. వరకు రోడ్లు విస్తరించి ఉన్నాయి. అందులో మెట్టు-గురువాపాటిపాలెం, కొత్తగుంటమల్లాం, బురదగాలికొత్తపాలెం, తాడిమేడు, ఆరూరు, కొత్తగుంట నుంచి చిట్టమూరు వరకు రోడ్డు దుస్థితి చెందింది. వాకాడు మండలంలోని 19 పంచాయతీల్లో పలు గ్రామాల రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయి.

**త్వరలో పనులు ప్రారంభిస్తాం**

కోట సబ్ డివిజన్ పరిధిలోని రోడ్ల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే మరమ్మతులు చేపడతాం. కోట రోడ్డుకు రూ.3 కోట్లు మంజూరయ్యాయి. త్వరలో పనులు ప్రారంభిస్తాం.

**- యోహాన్, ర.భ ఏఈ**



గూడలి వద్ద రహదారిపై నిలిచిన నీరు



భూమిపూజలో పాల్గొన్న ఎంపీడీవో, ఎంఈవోలు, ఉపాధ్యాయులు

## ఉపాధ్యాయుల సమావేశ భవనానికి భూమిపూజ

**తడ, న్యూస్‌టుడే:** స్థానిక వీసీఐఎన్ పరిశ్రమ యాజమాన్యం ఎంఆర్‌వో కార్యాలయ ఆవరణలో రూ.20లక్షల వ్యయంతో ఉపాధ్యాయుల సమావేశ భవన నిర్మాణం చేపట్టేందుకు ముందుకొచ్చింది. ఈ మేరకు శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. పరిశ్రమ ఎండీ ఎమ్.సెంథిల్‌కుమార్ విద్యా రంగానికి అందిస్తున్న సేవలను అధికారులు, ఉపాధ్యాయులు కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయకుమార్, ఎంఈవోలు సరస్వతి, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

## దొడ్లవారిమిట్టను చుట్టిన వరద

**పెళ్లకూరు, న్యూస్‌టుడే:** దొడ్లవారిమిట్టను వరద నీరు ముంచెత్తడంతో స్థానిక సర్పంచి కంద మూడి శివకుమార్ చొరవ తీసుకుని యంత్రాలతో కాలువ తీయించారు. రహదారి నిర్మాణ సంస్థ కాలువలు మూసేయడంతో నీరు ముందుకు వెళ్లలేదు. పరిస్థితి గమనించిన పంచాయతీ పాలకవర్గం నీటి ప్రవాహం కిందకు వెళ్లేలా ఏర్పాట్లు చేశారు.

